

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | గురువారం | 15-10-2026 | సంపుటి: 3 | సంచిక: 251 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | THURSDAY | 15-10-2026 | V0LUME : 3 | ISSUE : 251 | PAGES: 8 | COST: 2/- |


**విలేకరులు కావలెను**
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



# సింగరేణి చరిత్రను చీకటి చేసిన కాంగ్రెస్

- కాంగ్రెస్ వచ్చింది కరెంట్ పోయింది
- కరెంటు కోతకు సింగరేణి బాధ్యున్ని చేస్తే ఎట్లా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ ఉద్యమంలో 42 రోజుల పాటు బొగ్గు ఉత్పత్తి నిలిపివేసిన కార్మికులు
- కేసీఆర్‌కు అండగా నిలిచిన సింగరేణి కార్మిక లోకం
- ఉత్పత్తిలోనే కాదు.. ఉద్యమాల్లోనూ కార్మికులదే కీలక పాత్ర

**గోదావరిఖని, అక్టోబర్ 14:**
సింగరేణి కార్మికుల త్యాగాలు, తెలంగాణ ఉద్యమంలో వారు పోషించిన పాత్రను ఎప్పటికీ మరిచిపోలేమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఉద్యమానికి సింగరేణి కార్మికులు బలంగా అండగా నిలిచారని గుర్తుచేశారు. గోదావరిఖని సింగరేణి స్టేడియంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన మాట్లాడారు.
సింగరేణికి 137 ఏళ్ల చరిత్ర

మిగతా 3వ పేజీలో..

# రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్..



- ఒక్కొక్కరికి రూ.17,951
- 11.40 లక్షల మందికి పైగా నాన్-గెజిటెడ్ ఉద్యోగులకు లబ్ధి
- బోనస్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం.. రూ.2,009 కోట్ల వ్యయం
- కనీస వేతన పరిమితి రూ.7 వేల నుంచి రూ.18 వేలకు పెంచాలని యూనియన్ల డిమాండ్
- పరిమితి పెంచితే ఒక్కొక్కరికి రూ.46,184 బోనస్ ఇవ్వాలని విజ్ఞప్తి

4

## జంతర్‌మంతర్‌పై పోరాటం మరింత ఉధృతం!

- 16న జాతీయ పతాకాలతో భారీ నిరసనకు అభిజీత్ దీప్కే పిలుపు
- సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీ
- నిరసన హక్కును తిరిగి సాధిస్తామన్న రాహుల్ గాంధీ
- ఢిల్లీలో విద్యార్థి, యువజన సంఘాల ప్రదర్శనలు
- 24 గంటల్లో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని ఇండియా కూటమికి పిలుపు
- హైదరాబాద్‌లో భారీ సభకు సన్నాహాలు

4





## ఏ పక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదు

- పోచారంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన..
- ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదు
- రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి
- వచ్చే దసరా నాటికి మొదటి దశ ఇందిరమ్మ ఇళ్ల పూర్తి: మంత్రి శ్రీధర్‌బాబు

2




# సమాఖ్యల అవసరం ఎంతో ఉంది



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైటెక్స్‌లో సమాఖ్య బిజినెస్ సమ్మిట్ ప్రారంభం

**హైదరాబాద్, అక్టోబర్ 14 :**
సమాఖ్య అనే పదానికి చాలా బలం ఉందని, ఆధునిక యుగంలోనూ సమాఖ్యల అవసరం చాలా ఉందని, ఈ కాలంలో వస్తున్న మార్పులను తెలుసుకోవడానికి అందిపుచ్చుకోవడానికి సమాఖ్యలు ఉపయోగపడతాయి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో ఇవాళ, రేపు

మిగతా 2వ పేజీలో..

## పెట్టుబడులకు పూర్తి భద్రత

- రాష్ట్రంలో ప్రభుత్వ విధానాలు స్థిరంగా కొనసాగుతాయి
- రాబోయే రోజుల్లో తయారీ రంగం విస్తరణపై ప్రత్యేక దృష్టి
- ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్‌కు బ్రిటన్ పారిశ్రామికవేత్తలకు సీఎం ఆహ్వానం

2



## విద్యుత్ కోతలపై సీఎం ఆగ్రహం..

- అధికారులకు సస్పెన్షన్ హెచ్చరిక
- విద్యుత్ ఉత్పత్తి పెంచకపోవడంపై రేవంత్‌రెడ్డి నిలదీత
- స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీని సైతం ఉపేక్షించేది లేదని హెచ్చరిక
- యాదాద్రి ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి ఎందుకు చేయడం లేదని ప్రశ్న
- తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచన

2

# పాలమూరు జిల్లాలో మళ్లీ వలసల దుస్థితి

- రోడ్డు ప్రమాద బాధితులకు రూ.10లక్షల నష్టపరిహారం చెల్లించాలి
- నీళ్లుంటే ఈ వలసలు జరిగేవా?
- శ్రీశైలంలో నీళ్లున్నా మోటార్లు నడపలేదు
- విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయి
- ఉచిత కరెంటుకు ఉరితాడు జీవోనెం.17
- పాలమూరు వలసలకు రేవంత్ అసమర్థతే కారణం
- కొడంగల్లో రైతులకు బేడీలు
- నీళ్లడిగిన మక్తల్ రైతులపై నాన్ బెయిలబుల్ కేసులు
- సర్కార్ పై విరుచుకుపడ్డ హరీష్ రావు

3



## రైతులకు 8గంటలు కూడా కరెంట్ ఇవ్వడంలేదు

3

- మాటల్లోనే 24గంటల విద్యుత్
- చేతల్లో నిలువునా మోసం
- విద్యుత్ ట్రిప్పింగ్ లతో మడులకు నీరందడంలేదు
- హరీష్ రావు విమర్శలు

# సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి

- మూడేళ్లలో రూ.1,64,431 కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ
- ఈ లెక్కలపై ఎలాంటి చర్చకైనా, సవాల్‌కైనా సిద్ధం
- రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు
- జిల్లా వనరుల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు
- అచ్చంపేటను ప్రధాన జంక్షన్‌గా తీర్చిదిద్దుతాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2





## గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌కు తరలిరండి

- రైజింగ్ తెలంగాణ లక్ష్య సాధనలో భాగస్వాములు కండి
- 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్- 2026'లో మంత్రి శ్రీధర్‌బాబు

3

# మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో భార్యకు ఉరిశిక్ష

- ముస్కాన్ రస్తోగి, సాహిల్ శుక్లాలకు మరణశిక్ష విధించిన కోర్టు
- తీర్పులో భగవద్గీత, ధర్మసూత్రాలను ప్రస్తావించిన న్యాయమూర్తి

4





ఉప్పల్ స్టేడియంలో బతుకమ్మ, కళారూపాలు

- క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ప్రదర్శించిన పర్యాటక శాఖ

3

## ప్రపంచస్థాయి సాంకేతికతతో జౌళి రంగానికి కొత్త దిశ

- యూకే సంస్థలతో రెండు కీలక ఒప్పందాలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

3



## ఆధ్యాత్మిక కేంద్రం ముసుగులో వేధింపులు

- జూబ్లీహిల్స్‌లో శ్రీచైతన్య గురూజీపై కేసు నమోదు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భార్యకు అసభ్య సందేశాలు పంపినట్లు ఆరోపణలు
- ప్రశ్నించిన భర్తను చంపేస్తానంటూ బెదిరించినట్లు ఫిర్యాదు

3



# పెట్టుబడులకు పూర్తి భద్రత

**హైదరాబాద్, అక్టోబర్ 14 :**

తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని, ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కొనసాగుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బ్రిటన్ వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. రాబోయే కొన్నేళ్లలో తయారీ రంగాన్ని భారీగా విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో బ్రిటన్‌లోని యార్క్‌షైర్ ప్రాంతానికి చెందిన మేయర్ల నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బుధవారం సమావేశమైంది. సౌత్ యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్, యార్క్ అండ్ నార్త్ యార్క్‌షైర్ మేయర్ డేవిడ్ స్కైత్, వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ ఈ బృందానికి నాయకత్వం వహించారు. ఇటీవల భారత్‌బ్రిటన్ మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో తెలంగాణతో వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, విద్య, సాంస్కృతిక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశంలో అత్యంత యువ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ అనతికాలంలోనే ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. తెలంగాణ ఇప్పుడు కేవలం దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాక ప్రపంచంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీ పడుతోందని చెప్పారు. డిసెంబర్ 7 నుంచి భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు బ్రిటన్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళిక తెలంగాణ రైజింగ్2047 గురించి వివరించారు. 2025 డిసెంబర్‌లో ఆవిష్కరించిన ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కృత్రిమ మేధ విస్తరిస్తున్న నేపథ్యంలో యువతకు ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రముఖ కంపెనీల ప్రత్యక్ష భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇచ్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను త్వరలో ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. మూసీ నది పునరుజ్జీవం ద్వారా హైదరాబాద్ రివర్‌ఫ్రంట్ ఎకానమీ, నైట్ ఎకానమీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా బ్రిటన్ ప్రతినిధులు తెలంగాణతో అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, వైద్య ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్నికల్ టెక్స్‌టైల్స్, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ భాగస్వామ్యాన్ని ప్రత్యక్ష వాణిజ్య ఒప్పందాలు, పెట్టుబడులు, విద్యాసంస్థల మధ్య సహకారంగా మార్చేందుకు త్వరలో మరోసారి రాష్ట్రంలో పర్యటించాలని భావిస్తున్నట్లు తెలిపారు. సౌత్ యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్ మాట్లాడుతూ యార్క్‌షైర్ ప్రాంతంలో వివిధ రంగాలకు చెందిన సుమారు 1.50 లక్షల వ్యాపార సంస్థలు ఉన్నాయని తెలిపారు. దేశంలో అత్యధిక తలసరి జీఎస్‌డీపీ కలిగిన రాష్ట్రంగా ప్రస్తావిస్తూ రెండు ప్రాంతాల ఆర్థిక ప్రయోజనాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. తెలంగాణలోని డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార విస్తరణ అవకాశాలు ఎంతో ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ మాట్లాడుతూ యార్క్‌షైర్, తెలంగాణ మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయని, రెండు ప్రాంతాలు సోదర భావంతో కలిసి పనిచేసే అవకాశాలున్నాయని చెప్పారు. అంతకు ముందు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బ్రిటన్ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. జీనోమ్ వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, క్లీన్ ఎనర్జీ, నాలెడ్జ్ ఆధారిత ఆర్థికాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు. ఉత్తర ఇంగ్లండ్ ప్రాంతానికి ఉన్న పారిశ్రామిక, సాంకేతిక సామర్థ్యాలతో తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలకు మంచి అనుసంధానం ఉందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నేతృత్వంలోని బృందం బ్రిటన్‌లో పర్యటించి ప్రముఖ విశ్వవిద్యాలయాలు, వ్యాపార సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకున్న విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలకు తెలంగాణ కేంద్రంగా ఎదిగే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూకేఇండియా సెటా అండ్ రీజినల్ సినర్జీస్ పేరుతో యూకేఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూకేఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో కిషోర్ జయరామన్, హైదరాబాద్ బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ ప్రతినిధులు, కె. రామకృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు సంజయ్ జాజు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై సీఎం ఆగ్రహం..

**హైదరాబాద్, అక్టోబర్ 14:**

తెలంగాణలో విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సజావుగా సాగేందుకు పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని అధికారులను నిలదీశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీతో సహా ఎవరినీ ఉపేక్షించబోనని, అవసరమైతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

**యాదాద్రి ప్లాంట్‌పై నిలదీత**

నైనీ, మహానది బొగ్గు గనుల నుంచి బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసినప్పటికీ యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని సీఎం ప్రశ్నించారు. విద్యుత్ అంతరాయాలకు గల కారణాలను వెంటనే నివేదించాలని అధికారులను ఆదేశించారు. పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్ అందించాలని స్పష్టంగా చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన బాధ్యత తనపై ఉందని, అధికారులు కూడా తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు.

**ఎల్‌నినో పరిస్థితులపై అప్రమత్తం**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ అంతరాయాలు తదితర అంశాలపై బుధవారం ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా నెలకొన్న పరిస్థితులను అధికారులు ఆయనకు వివరించారు. విద్యుత్, తాగునీటి సమస్యలు తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాకు పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంతో పాటు ఇతర అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పశుసంపద సంరక్షణకు, పశుగ్రాసం కొరత నివారణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎల్‌నినోను విపత్తుగా పరిగణించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మండలానికి గ్రూప్ 1, గ్రూప్ 2 అధికారులను నియమించి పరిస్థితులను పర్యవేక్షించే బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. మండలాల వారీగా పరిస్థితులపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం అందేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి

**అచ్చంపేట, అక్టోబర్ 14 :**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందని కుటుంబం లేదని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత మూడేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1,64,431 కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ చేశామని వెల్లడించారు. ఈ లెక్కలపై ఎవరితోనైనా చర్చించేందుకు, ఎలాంటి సవాల్‌నైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రతి రూపాయిని వారి అభివృద్ధి, సంక్షేమం కోసమే ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గంలో రూ.74.82 కోట్ల వివిధ అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. మన్ననూరులో 220/33 కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని, జిల్లాల్లో అందుబాటులో ఉన్న సహజ వనరులు, నదులు, ఖనిజ సంపద, మానవ వనరుల ఆధారంగా ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతామని చెప్పారు. అచ్చంపేట ప్రాంతాన్ని ప్రధాన రవాణా కూడలిగా అభివృద్ధి చేయడంతోపాటు పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు.

**ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు**

రాష్ట్రంలో కోటి 15 లక్షల కుటుంబాలు ఉండగా కోటి ఆరు లక్షల కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు అందుతున్నాయని భట్టి విక్రమార్క వివరించారు. పేదల ఆహార భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రతి వ్యక్తికీ ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, దాదాపు కోటి ఆరు లక్షల కుటుంబాలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తున్నామని, 43 లక్షల కుటుంబాలకు చేయూత పింఛన్లు అందిస్తున్నామని, 71.40 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి ప్రతి సీజన్‌లో రూ.6 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. రైతు భరోసా, పంట రుణ మాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా అర్హులైన ప్రజలకు ప్రయోజనాలు అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 76 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగావకాశాలు కల్పించామని చెప్పారు. ఏడు లక్షల మంది పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. కేవలం ఈ నియోజకవర్గంలోనే 7,300 ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ ఇస్తున్నామని చెప్పారు. కళాశాలల్లో చదువుతున్న సుమారు 12 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో నవంబర్ 19న ఇందిరమ్మ జయంతి సందర్భంగా కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రతి కుటుంబానికీ వర్తించేలా ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని వెల్లడించారు.

**రహదారులకు రూ.90 వేల కోట్లు**

రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో భారీగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, క్లస్టర్ డెవలప్‌మెంట్ వంటి ప్రాజెక్టులపై దృష్టి సారించామని వివరించారు. రాష్ట్ర అభివృద్ధిని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ప్రతి జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. నదులు, ఖనిజ సంపద, వ్యవసాయం, పర్యాటకం, మానవ వనరులను సమర్థంగా వినియోగించుకొని జిల్లాలవారీగా ఆర్థిక ప్రగతిని సాధిస్తామని స్పష్టం చేశారు.

**అచ్చంపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం**

నియోజకవర్గంతో తనకు 1980 నుంచి విడదీయలేని అనుబంధం ఉందని భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. తన సోదరుడు స్వర్గీయ మల్లు అనంతరాములు ఈ ప్రాంతం నుంచి పార్లమెంటుకు పోటీ చేసిన రోజుల నుంచి ఇక్కడి గ్రామాలతో తనకు పరిచయం ఉందని చెప్పారు. విద్యార్థిగా ఉన్నప్పటినుంచి ఈ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో పర్యటించానని, ప్రజల సమస్యలను దగ్గరగా చూశానని తెలిపారు. గతంలో ఈ ప్రాంత ప్రజలు ప్రధానంగా విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం విద్యుత్ శాఖ తన వద్ద ఉండటంతో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటికే 1,219 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 403 కి.మీ మేర కొత్త విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేశామని, 5 వేల కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని వివరించారు. ఈ పనుల కోసం ఇప్పటికే సుమారు రూ.75 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు, రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. రాబోయే 50 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేశామని వెల్లడించారు.

**ఎకో టూరిజంతో స్థానికులకు ఉపాధి**

అచ్చంపేట ప్రాంతంలో రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, కృష్ణానదిపై వంతెనలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందుతున్నాయని తెలిపారు. వీటి ద్వారా అచ్చంపేటను ప్రధాన రవాణా కూడలిగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు. మన్ననూరు, నల్లమల అటవీ ప్రాంతాలకు ఉన్న సహజ సౌందర్యం, వన్యప్రాణుల సంపదను పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. ఎకో టూర్సిం అభివృద్ధి ద్వారా స్థానిక గిరిజన కుటుంబాలు, రైతులు, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. పర్యాటకులు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు స్థానికంగా వసతి, ఆతిథ్యం, రవాణా, ఇతర సేవల ద్వారా కుటుంబాలకు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలను గుర్తించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు, నిధులు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

**ప్రజల సమస్యలే ప్రభుత్వ ప్రాధాన్యాలు**

గతంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా ఈ నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో పర్యటించిన రోజులను భట్టి గుర్తు చేసుకున్నారు. 2023 మే 31న లింగాల మండలం అంబటపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్రలో భాగంగా నియోజకవర్గంలోని సుమారు 42 గ్రామాల్లో 130 కి.మీ మేర నడిచామని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు పెన్షన్లు, గ్యాస్, పోడు భూములు, విద్యుత్ బిల్లులు, సాగునీరు వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును సందర్శించినప్పుడు పనులు పూర్తి చేసి నీటిని అందిస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. నక్కలగండి ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలనే అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటుందని తెలిపారు. ప్రజల సమస్యలను మరిచిపోకుండా, రాష్ట్ర ఆదాయానికి అనుగుణంగా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# సమాఖ్యల అవసరం ఎంతో ఉంది

**మొదటిపేజీ తరువాయి**

రెండు రోజులపాటు జరగు సమాఖ్య బిజినెస్ సమ్మిట్ 2026ను ఆయన బుధవారం ప్రారంభించి ప్రసంగించారు. పురాతన కాలంలో వస్తు మార్పిడి పద్ధతి ద్వారా వ్యాపారం చేసేవారని పేర్కొన్నారు. ఆధునిక యుగంలోనూ సమాఖ్యల అవసరం చాలా ఉందని వెల్లడించారు. కొత్త తరం అభివృద్ధి చెందాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సినిమా, రాజకీయ రంగాల్లో మున్నూరు కాపు సామాజికవర్గం నుంచి వివిధ హోదాల్లో రాణించారని, ఉన్నత శిఖరాలకు ఎదగడమే కాదు.. అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. సక్సెస్ స్టోరీస్‌ను సమాఖ్య నిక్షిప్తం చేసి కొత్త తరానికి అందించాలన్నారు. 2047 నాటికి స్వతంత్ర భారతం వందేళ్లు పూర్తి చేసుకోబోతోందని, ప్రధాని మోదీ 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారని, ఇందుకు రాష్ట్రాల సహకారం అవసరం అని చెప్పారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. అభివృద్ధి విషయంలో కాదు అన్నారు. అందుకే 2025లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నాం.. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్)గా అభివృద్ధి చేస్తున్నామని, ఇక్కడ ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నామని సీఎం తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్)గా అభివృద్ధి చేసుకుంటున్నామని, ఈ ప్రాంతంలో తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ రంగాలను ప్రోత్సహిస్తామని, మిగిలిన గ్రామీణ ప్రాంతాలను రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్)గా అభివృద్ధి చేస్తున్నామని, ఇక్కడ వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయాధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధికి ప్రాధాన్యం ఇస్తామని వివరించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్నదే తమ సంకల్పమన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ 5 శాతం కంట్రిబ్యూట్ చేస్తోందని, దీన్ని 10 శాతానికి చేర్చాలనే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. నాలుగు వందల ఏళ్ల క్రితమే దేశవిదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలకు చార్మినార్ ల్యాండ్ మార్క్‌గా మారిందని, ఇపుడు హైటెక్ సిటీ అయిందని చెప్పారు. నూతన పారిశ్రామిక విధానంలో మీరంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు మనవాళ్లు కార్పొరేట్ కంపెనీలకు సర్వీస్ చేసే వైపు మాత్రమే ఉన్నారంటూ మన ప్రాంతానికి చెందిన వాళ్లు పెట్టుబడులు పెట్టి గ్లోబల్‌గా ఎదగాలన్నారు.

**మహిళా భాగస్వామ్యం ఉన్న దేశాలే బలపడ్డాయి**

ఒకసారి మనం ప్రపంచాన్ని గమనిస్తే మహిళల భాగస్వామ్యం ఉన్న దేశాలే ఆర్థికంగా బలపడ్డాయని చెప్పారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందంటూ తెలంగాణలో మహిళలకు 61 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, ఆర్టీసీ బస్సులకు, పెట్రోల్ బంకులకు, సోలార్ ప్లాంట్‌స్‌కు మహిళలను యజమానులను చేశామని వివరించారు. సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు



నా సూచన ఒక్కటే.. యువతతోపాటు మహిళలను ప్రోత్సహించండి అన్నారు. ప్రభుత్వం వైపు నుంచి కావాల్సిన సహకారం అందిస్తామని, మంచి విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని, మీ పెట్టుబడులకు తమ భరోసా ఉంటుందని అన్నారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా ముందుకు వెళదాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమానికి ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘు రామరాజు, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, దానం నాగేందర్, మున్నూరు కాపు ఫౌండేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జస్టిస్ భవానీప్రసాద్, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, తదితరులు హాజరయ్యారు.

# ఏ పక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదు

**హైదరాబాద్, అక్టోబర్ 14 :**

గత బీఆరఎస్ ప్రభుత్వంలో ఆ కుటుంబం ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పరిమితమైతే రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పార్టీల తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా చూస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిలతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు రూ.వందల కోట్లT ఉన్నప్పటికీ పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. క్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఆరుచోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్దిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని గుర్తించి అర్హతలను ధ్రువీకరించిన అనంతరం పారదర్శకంగా డ్రా నిర్వహించామని చెప్పారు. ఎంపికైన వారిలో స్థానికంగా నివసించే అర్హులనే నిర్ధారించి ఇళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లT మంజూరు చేశామని, ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరోసారి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్దిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోమని, ఎలాంటి రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని మంత్రి ప్రకటించారు. ప్రతి అపార్టుమెంటుకు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులు సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్దిదారులకు అందించడంతోపాటు ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు. ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు నిబంధనల ప్రకారం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ.440 కోట్లు ఖర్చు చేశామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూచౌదరి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో లబ్దిదారులు స్నేహ, శివకుమారి, రెహ్మతి తదితరులు మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని, ప్రభుత్వ పని తీరును ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపు జరిగింది.

**వచ్చే దసరాకు మొదటి దశ ఇళ్ల పూర్తి : మంత్రి దుద్దిళ్ల**

మొదటి దశలో కేటాయింపులు జరిగిన ఇందిరమ్మ ఇళ్లను ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి లబ్దిదారులకు అందజేస్తామని ఐటి, పరిశ్రమలు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో ఏళ్లతరబడి నిర్మాణాలు కొనసాగేవని, అలాంటి పరిస్థితి ఇప్పుడు ఉండదని అన్నారు. పోచారంలో 480 మందికి కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగించారు. ఇందిరమ్మ టవర్స్‌కు రోడ్లు, మంచినీటి సదుపాయం, లిఫ్ట్ వంటి మౌలిక సదుపాయాలను గడువులోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే హామీ ఇచ్చిన మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, తెల్ల రేషన్ కార్డులపై ఒక్కొక్కరికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇళ్లు లేని పేదలకు వారి సొంత నియోజకవర్గం పరిధిలోనే ఇందిరమ్మ గృహాలను నిర్మించి ఇస్తున్నామని చెప్పారు. పోచారం ప్రాంతంలో సింగిల్ బెడ్ రూం కొనాలన్నా రూ.40 లక్షలు ఖర్చవుతుందని, అలాంటిది రూ.6 లక్షలు భరిస్తే అంతకంటే విలువైన ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. ఇళ్ల కేటాయింపులు అత్యంత పారదర్శకంగా మానవ ప్రమేయం లేకుండా లాటరీ పద్ధతిలో జరుపుతున్నామని చెప్పారు.

# రైతులకు 8గంటలు కూడా కరెంట్ ఇవ్వడంలేదు

**గద్వాల, అక్టోబర్ 14:**

గద్వాల నియోజకవర్గం గట్టు మండలంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదని ఉదయం నుంచి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని హరీష్‌రావు తెలిపారు. గట్టు మండలంలో సాగునీరు, విద్యుత్ అందక ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి విద్యుత్ సరఫరా తీరును పరిశీలించేందుకు గట్టు మండల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కనీసం 78 గంటల కరెంట్ కూడా రావడం లేదని, మధ్యమధ్యలో పదేపదే ట్రిప్ అవుతూ మోటార్లు నడవక పంటలు ఎండిపోతున్నాయని రైతులు గోదు వెళ్లబోసుకున్నారు.రైతుల ఆవేదన వాస్తవమా కాదా అని స్వయంగా నిర్ధారించుకోవడానికే తామంతా గట్టు సబ్‌స్టేషన్‌కు వచ్చి అధికారుల అధికారిక లాగ్‌బుక్‌ను స్వయంగా పరిశీలించానన్నారు. నిన్న అక్టోబర్ 13 లాగ్‌బుక్ రికార్డుల ప్రకారం రైతులకు ఇచ్చిన త్రీఫేస్ కరెంట్ కేవలం 7 గంటల 50 నిమిషాలు మాత్రమే. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కనీసం 8 గంటల కరెంట్ కూడా ఇవ్వలేకపోయింది. ఆ ఇచ్చిన 7 గంటల 50 నిమిషాల్లో కూడా నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వలేదు. అందులోనూ మూడు సార్లు విద్యుత్ సరఫరాను బంద్ చేశారు. ఒకసారి గంట సేపు, మరోసారి ఐదు నిమిషాలు, ఇంకోసారి పది నిమిషాల పాటు కరెంట్ నిలిపివేశారు. ఇచ్చిన అరకొర సమయంలోనే మూడు నాలుగు సార్లు కరెంట్ కోతలు పెట్టడం సిగ్గుచేటు.ఇలా పదేపదే విద్యుత్ ట్రిప్ అవ్వడం వల్ల తీవ్ర నష్టం జరుగుతోంది. బోరు ఆన్ చేసి నీళ్లు పారేలోపే కరెంట్ పోతోంది, మళ్లీ వచ్చినప్పుడు మొదట పారిన మడే పారుతోంది తప్ప వెనక మళ్లకు నీళ్లు అందడం లేదు. ఫలితంగా చివరి మళ్లకు చుక్క నీరు అందక పంటలన్నీ రైతుల కళ్లముందే నిలువునా ఎండిపోతున్నాయి.కేసీఆర్ 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం 7 గంటల 50 నిమిషాల కరెంటు ఇచ్చి అందులోనూ గంటల కొద్దీ కోతలు విధిస్తూ అన్నదాతల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. లాగ్‌బుక్ ఆధారంగా సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను నిలదీస్తే చేదు నిజాలు బయటపడ్డాయి. మేం ఏం చేస్తాం సార్.. పైనుంచి బంద్ చేయమంటే బంద్ చేస్తాం, ఆన్ చేయమంటే ఆన్ చేస్తాం.. మా ఫోన్లకు అధికారుల నుంచి బంద్ చేయమని మెసేజ్‌లు వస్తాయి తప్ప మా చేతుల్లో ఏమీ లేదు.. పైనుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంత కరెంట్ ఇస్తే అంతే ఇస్తాం అని ఆపరేటర్ తన ఫోన్ చూపిస్తూ స్పష్టం చేశాడు. దీన్నిబట్టి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పైనుంచే రైతుల కరెంట్‌ను కట్ చేస్తోందని రుజువైందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హైదరాబాద్ ముఖ్యం, హైటెక్ సిటీ ముఖ్యం, బడా పరిశ్రమలు ముఖ్యం.. కానీ పల్లెల్లోని పేద రైతులు మాత్రం ముఖ్యం కాదు.అందరూ వాడుకున్న తర్వాత కరెంట్ ఏమైనా మిగిలితే, ఆ మిగిలిన లోవోల్టేజ్ కరెంటును గట్టు ప్రాంత రైతులకు ఇస్తున్నారు. ఒకవేళ హైదరాబాద్‌కో, పరిశ్రమలకో ఎక్కువ విద్యుత్ అవసరమైతే వెంటనే గట్టు సబ్‌స్టేషన్‌కు, ఇక్కడి రైతులకు కరెంట్ బంద్ చేస్తున్నారు. నగరాలకు, ఐటీ కంపెనీలకు నిరంతరాయంగా విద్యుత్ ఇచ్చి, రైతుల కరెంటుకు మాత్రం ఎసరు పెడుతున్నారు. కేసీఆర్ కు, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఉన్న ప్రధాన తేడాను రైతాంగం స్పష్టంగా గమనించాలని కోరారు. కేసీఆర్ రైతును దేశానికి వెన్నెముకగా భావించి, మొదట రైతులకు కడుపునిండా 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇచ్చి ఆ తర్వాత మిగిలిన విద్యుత్‌ను పరిశ్రమలకు, ఇతర అవసరాలకు సర్దుబాటు చేశారు.కానీ నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైదరాబాద్‌కు, పరిశ్రమలకు కడుపునిండా కరెంట్ ఇచ్చి.. చివరకు మిగిలిన అడుగుబొడుగు లో వోల్టేజ్ విద్యుత్‌ను అన్నదాతల ముఖాన కొడుతోంది. ఈ మోసపూరిత విధానాన్ని రైతు సోదరులు గుర్తించి రేవంత్ సర్కార్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

# పాలమూరు జిల్లాలో మళ్లీ వలసల దుస్థితి

**గద్వాల,, అక్టోబర్ 14 :**

పాలమూరు జిల్లా నుంచి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆనాటి రోజులు తెస్తా.. పాత రోజులు తెస్తా అన్నాడు.. చెప్పినట్లే పాలమూరుకు పాత వలసల రోజులు తీసుకొచ్చాడని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. గద్వాల జిల్లా ఇందువాసి గ్రామంలో దాదాపు 40 దళిత కుటుంబాలు కూలి పనుల కోసం పక్క రాష్ట్రమైన కర్ణాటకకు వెళ్లి యాదగిరి జిల్లాలో రోడ్డు ప్రమాదానికి గురవడంతో బుధవారం ఆయన వారిని పరామర్శించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మరణించడగా మరో ఇద్దరి పరిస్థితి విషయమంగా వుంది. ఈ నేపథ్యంలో కేసీఆర్ స్పందించి బాధితులను పరామర్శించి సహాయం అందించమని అదేశించగా ప్రమాదంలో మరణించిన ఏసేపు, నాగన్న కుటుంబ సభ్యులను ఓదార్చి బీఆర్ఎస్ తరపున వారికి తక్షణ ఆర్ధిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంతవరకు ఈ సంఘటనపై కలెక్టర్, ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. బాధితులకు రూ.10లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, తీవ్రంగా గాయపడ్డ వారికి ప్రభుత్వం తరపున మెరుగైన పూర్తి ఉచిత వైద్యం అందిస్తూనే తగిన ఆర్థిక సాయం అందించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. సాగునీరు రాక, కరెంట్ లేక, చేతినిండా కూలి దొరకక మళ్లీ వలసలు మొదలయ్యాయి. ఈ గ్రామంలో ఎవరిని కదిలించినా కరెంట్ రావడం లేదని, కరెంట్ పరిస్థితి ఘోరంగా మారిందని లబోదిబోమంటున్నారన్నారు. కనీసం 67 గంటల కరెంట్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారన్నారు. మేం ఇక్కడికి వస్తుంటే మార్గమధ్యంలో మల్దకల్, అయిజలో రైతులు మా కారును ఆపి సార్, రేవంత్ రెడ్డిని గట్టిగా నిలదీయండి.. నేను రైతును, ఎనిమిది ఎకరాల్లో పంట వేస్తే కరెంట్ రాక నిలువునా ఎండిపోతోంది అని ఎంతో ఆవేదనతో మొరపెట్టుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో పల్లె పల్లె పాలమూరులోన పల్లేర్లు మొలిసెనా అంటూ వలసల వేదనపై పాటలు పాడుకున్న దుస్థితి ఉండేది. కానీ రాష్ట్రం వచ్చి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ చూపి నెట్టంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి లాంటి పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారు. దాదాపు రూ. 4 వేల కోట్లు ఖర్చు పెట్టి పెద్ద ఎత్తున చెక్ డ్యామ్‌లు నిర్మించి, చెరువులు బాగుచేసి పాలమూరు జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఈ ఇందువాసి గ్రామానికి కూడా నెట్టంపాడు నీళ్లను పారించింది బీఆర్ఎస్సే. 24 గంటల కరెంట్, రైతుబంధు ఇచ్చి ఆదుకున్నాం. దాంతో గ్రామం పత్తి, పొగాకు, మొక్కజొన్న విత్తన పంటలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి, పెద్ద పెద్ద సీడ్ కంపెనీలు ఇక్కడికి వచ్చి రైతులతో ఒప్పందాలు చేసుకున్నాయి. గ్రామస్తులందరికీ పుష్కలంగా ఉపాధి దొరికింది. గతంలో కేటీఆర్ వచ్చినప్పుడు రోడ్డుపై కూలీలను పలకరిస్తే మేము కర్ణాటక నుంచి, కర్నూలు నుంచి గద్వాలకు కూలి పనుల కోసం వలస వచ్చామని చెప్పిన పరిస్థితి ఉండేది. ఈ ప్రభుత్వం విద్యుత్ సరఫరాలో పూర్తిగా విఫలమైంది. ఆనాడు కేసీఆర్ పాలనలో బొంబాయి, దుబాయ్ పోయిన పాలమూరు బిడ్డలు తిరిగి సొంత గ్రామాలకు వచ్చి గౌరవంగా వ్యవసాయం చేసుకుని బతికారు. కానీ కాంగ్రెస్ పాలన రాగానే మళ్లీ వలసలు ప్రారంభమయ్యాయి. సీఎం సొంత జిల్లాలోని ఈ గ్రామం నుంచి 40 దళిత కుటుంబాలు పొట్టచేతపట్టుకుని కర్ణాటకకు వలసపోయే దుస్థితి వచ్చిందంటే రేవంత్ రెడ్డి సిగ్గుతో తలదించుకోవాలి, ప్రజలకు క్షమాపణ చెప్పాలి.నీ పాలనలో నీ జిల్లాలోని వలసకూలీలకు కూడా నువ్వు న్యాయం చేయలేకపోయావు. కేసీఆర్ గారు వలసపోయినోళ్లను వాపస్ తెస్తే, నువ్వు మాత్రం పాలమూరు బిడ్డలను మళ్లీ వలసలపాలు చేశావు.దీనికి ముమ్మాటికీ కరెంట్ ఇవ్వకపోవడం, నీళ్లు ఇవ్వకపోవడమే కారణం. నెట్టంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టుల్లో 24 గంటలు నడపాల్సిన మోటార్లను 89 గంటలే నడిపి నీళ్లు ఎత్తకపోవడం వల్ల చివరి ఆయకట్టుకు నీళ్లందక పంటలు ఎండిపోయి జనం వలసబాట పట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక పాలమూరు జిల్లాలో ఒక్క ఎకరానికైనా కొత్తగా సాగునీరు ఇచ్చారా? ఒక్క చెక్ డ్యామ్ కట్టారా? ఒక్క చెరువునైనా బాగుచేశారా?కేసీఆర్ గారు కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి లాంటి ప్రాజెక్టులను, వాటి మోటార్లను కూడా నడపడం చేతకావడం లేదు. కల్వకుర్తి, నెట్టంపాడు, భీమాల్లో 24 గంటలు నడవాల్సిన మోటార్లను 78 గంటలే ఎందుకు నడుపుతున్నారు?ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ అసమర్థత తెచ్చిన కరువు. నీళ్లు ఎత్తకపోవడం, కరెంట్ ఇవ్వకపోవడం వల్ల పాలమూరుకు రేవంత్ రెడ్డి రూపంలో గ్రహణం పట్టింది.శ్రీశైలంలో నీళ్లున్నా ఐదు మోటార్లు నడపాల్సిన చోట రెండే మోటార్లు నడుపుతున్నారు. లోవోల్టేజీతో రైతుల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి, బోర్ల నుంచి నీళ్లు రావడం లేదు.మంత్రులు తుమ్మల, పొంగులేటి ప్రజలను భయపెడుతూ 'ఎల్‌నినో' వల్ల కరువు వచ్చిందని సాకులు చెబుతున్నారు. ఎల్‌నినోకు బొగ్గు కొరతకు ఏం సంబంధం?బొగ్గు లేక కరెంట్ ఉత్పత్తి ఆగిపోయింది మీ చేతగానితనం వల్ల కాదా? ఇది ఎల్‌నినో కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ వైఫల్యం తెచ్చిన 'ఎల్‌కాంగో' కరువు. పక్క రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృష్ణా నది నీళ్లను 700 కిలోమీటర్లు తీసుకెళ్లి కుప్పంలో పారిస్తున్నాడు. వెలిగొండ ప్రాజెక్టును మొదలుపెట్టి రాయలసీమలో నీళ్లు పారిస్తూ జలహారతులు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రాప్ హాలిడే లేదు.. కానీ తెలంగాణలో క్రాప్ హాలిడే ఎందుకు వచ్చింది? గోదావరి, కృష్ణా నదులు తెలంగాణ నుంచే కదా కిందికి పోవాలి.. తెలంగాణలో నీళ్లను ఒడిసిపట్టకుండా రేవంత్ రెడ్డి విడిచిపెట్టడం వల్లే కదా చంద్రబాబు ఒడిసిపట్టిడు.. పక్కనే కృష్ణమ్మ పారుతున్నా మన ఇందువాసిలో నీళ్లు లేవు. కరెంట్ లేక మిరప, పత్తి పంటలు ఎక్కడికక్కడ ఎండిపోయి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కేసీఆర్ పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 80 శాతం పూర్తి చేసి, 50 టీఎంసీలు నింపుకునే రిజర్వాయర్లు, టన్నెళ్లు, పంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్లు నిర్మించి సిద్ధం చేశారు.ప్యాకేజీ3 లో మూడు నెలలు గట్టిగా పనిచేస్తే పూర్తయ్యే చిన్న పనిని మూడేళ్లయినా ఈ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. ఆ పని పూర్తి చేసుంటే శ్రీశైలం నుంచి 50 టీఎంసీల నీళ్లు ఎత్తిపోసి పాలమూరు నెత్తిమీద కుండలా పెట్టుకునేవాళ్లం.. జిల్లాలో అసలు కరువు అనే మాటే ఉండేది కాదు.మీ చేతగానితనం, నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి వచ్చింది. కేసీఆర్ ఉన్నప్పుడు కరోనా మహమ్మారి వచ్చినా నీళ్లు ఆగలేదు, కరెంట్ ఆగలేదు, రైతుబంధు ఆగలేదు.రైతును కేంద్రంగా చేసుకుని పాలన సాగింది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దేవుడి మీద ఒట్లు పెట్టి రుణమాఫీ ఎగ్గొట్టింది, మూడు పంటల రైతుబంధు ఎగ్గొట్టింది, రైతుబీమాను రద్దు చేసింది.నిన్న కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 17తో ఒక విషయం స్పష్టమైంది. 24 గంటల ఉచిత కరెంటుకు కాంగ్రెస్ పార్టీ ఉరివేసింది.ఆ ఉరే జీవో 17. వ్యవసాయం కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' పెట్టి, దానికి కేవలం సోలార్ పవర్‌ను మాత్రమే కేటాయించారు. సోలార్ పవర్ అంటే ఉదయం 78 గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటలకే పోతుంది.అంటే రైతులకు 67 గంటల కరెంటుకు మించి ఇచ్చేది లేదని జీవో 17 ద్వారా ప్రభుత్వం అధికారికంగా తేల్చేసింది. ఇకపై రైతులకు రాత్రిపూట కరెంట్ రాదు, కేసీఆర్ ఇచ్చినట్లు 24 గంటల కరెంటూ రాదు. ఇదే జిల్లాలో తిరుగుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను, సీఎం రేవంత్ రెడ్డిని సూటిగా అడుగుతున్నా.. 24 గంటల కరెంట్ ఇస్తారా ఇవ్వరా? రైతులంటే ఎందుకంత చిన్నచూపు? రైతు అనగానే మీ చేతులకు కోతలు ఎందుకు పడుతున్నాయి..ఎన్నికల మేనిఫెస్టోలో, అసెంబ్లీ బడ్జెట్లో పెట్టి బల్లలు చరిచి మరీ వ్యవసాయ కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' కింద ఏటా రూ. 12,000 ఇస్తామని చెప్పారు.

# సింగరేణి చరిత్రను చీకటి చేసిన కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి**

ఉందని, ఈ ప్రస్థానంలో కార్మికుల శ్రమ, త్యాగాలు అంతర్భాగమని కేటీఆర్ పేర్కొన్నారు. బొగ్గు గనుల్లో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయినవారు, శాశ్వత వైకల్యానికి గురైనవారు ఎంతోమంది ఉన్నారని చెప్పారు. చీకటి గనుల్లో ప్రాణాలకు తెగించి పనిచేస్తూ దేశానికి విద్యుత్ వెలుగులు అందిస్తున్న కార్మికులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు.

**ఉత్పత్తిలోనే కాదు.. ఉద్యమాల్లోనూ ముందంజ**

బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా ఉద్యమాల్లోనూ సింగరేణి కార్మికులు ముందున్నారని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ పిలుపు మేరకు సకల జనుల సమ్మెలో కార్మికులు 35 రోజులు, మరోసారి ఏడు రోజులు కలిపి మొత్తం 42 రోజులపాటు బొగ్గు ఉత్పత్తిని నిలిపివేశారని గుర్తుచేశారు. దీంతో దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన పోరాటానికి సింగరేణి కార్మిక లోకం వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సమయంలోనూ కార్మికులు ఆయనకు మద్దతుగా ఉద్యమించారని తెలిపారు. కేసీఆర్ 11 రోజుల పాటు దీక్ష కొనసాగించిన సందర్భంలో సింగరేణి కార్మికులు ఏడు రోజుల పాటు ఆయనతో కలిసి పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. సాధారణంగా కార్మిక సంఘాలు వేతనాలు, బోనస్‌లు, హక్కుల కోసం పోరాడతాయని, తెలంగాణలో మాత్రం కార్మికులు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కూడా ఉద్యమించారని అన్నారు. అలాంటి పోరాట చరిత్ర కలిగిన గడ్డ గోదావరిఖని అని కేటీఆర్ పేర్కొన్నారు.

**గడ్డం పెంచితేనే సింగరేణికి గుర్తింపు**

కరీంనగర్‌లో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ బాబు తనను ఆపి గడ్డం ఎందుకు పెంచావని అడిగారని కేటీఆర్ చెప్పారు. తాను గోదావరిఖనికి వెళ్తున్నానని చెప్పగా, సింగరేణికి వెళ్తున్నప్పుడు ఆ మాత్రం ఉండాల్సిందేనని సమాధానమిచ్చినట్లు వివరించారు.

# హైదరాబాద్‌లో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ..

- **24న రాహుల్, ప్రియాంక రాక**

**హైదరాబాద్, అక్టోబర్ 14:**

ఇండీ కూటమి ఆధ్వర్యంలో ఈ నెల 24న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతోంది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఈ సభకు హాజరుకానున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సుమారు లక్ష మందిని సమీకరించి సభను విజయవంతం చేయాలని నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఢిల్లీలో ఇండీ కూటమి చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో తెలంగాణ కాంగ్రెస్ నేతలు పాల్గొంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం నిర్వహిస్తున్న సమావేశాలకు హాజరవుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ, కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారంపై భవిష్యత్తు కార్యాచరణను చర్చిస్తున్నారు.

**సీఈసీ తొలగింపే లక్ష్యం**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ నివాసంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ అంశంపై చర్చించినట్లు తెలిపారు. సీఈసీ వ్యవహారశైలి కారణంగా దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆరోపించారు.

# ఉప్పల్ స్టేడియంలో బతుకమ్మ, కళారూపాలు

- **క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ప్రదర్శించిన పర్యాటక శాఖ**

**హైదరాబాద్, అక్టోబర్ 14 :**

ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత్‌వెస్టిండీస్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని, పర్యాటక ప్రాధాన్యతను విస్తృతంగా ప్రచారం చేసే లక్ష్యంతో రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించింది. రాష్ట్రానికి ప్రతీకగా నిలిచే పూల పండుగ బతుకమ్మ వైభవాన్ని స్టేడియంలో ప్రదర్శించారు. బతుకమ్మ సంప్రదాయాలు, వేడుకల ద్వారా రాష్ట్ర ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును క్రికెట్ అభిమానులకు పరిచయం చేశారు. ప్రకృతితో మానవ సంబంధం, సామూహిక భాగస్వామ్యం, తెలంగాణ ప్రజల జీవన విధానంలో అంతర్భాగమైన సాంస్కృతిక విలువలను బతుకమ్మ పండుగ ప్రతిబింబించింది. స్థానిక కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ జానపద కళారూపాలు ఈ కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి. తెలంగాణకు ప్రత్యేకమైన జానపద సంగీతం, నృత్యాలు, సాంప్రదాయ కళాప్రదర్శనలను ఆవిష్కరించారు. క్రీడా ఉత్సాహానికి సాంస్కృతిక వైభవాన్ని జోడిస్తూ, క్రికెట్ అభిమానులకు క్రీడలు, సంస్కృతి, వినోదం కలగలిసిన ప్రత్యేక అనుభూతిని కలిగించారు. పర్యాటక ప్రచార కార్యక్రమంలో భాగంగా మ్యాచ్ విరామ సమయంలో తెలంగాణ పర్యాటక శాఖ రూపొందించిన పర్యాటక ప్రచార చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ చిత్రంలో రాష్ట్రంలోని చారిత్రక కోటలు, వారసత్వ కట్టడాలు, ప్రసిద్ధ దేవాలయాలు, ప్రకృతి సౌందర్యంతో అలరించే పర్యాటక ప్రాంతాలు, ప్రత్యేక సాంస్కృతిక అనుభవాలు, బతుకమ్మ పండుగ వైభవం వంటి విశేషాలను ప్రదర్శించారు. తెలంగాణలోని వైవిధ్యభరితమైన పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, రాష్ట్రాన్ని సందర్శించేలా పర్యాటకులను ప్రోత్సహించడం ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశ్యం. అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికను సాంస్కృతిక, పర్యాటక ప్రచారానికి వినియోగించడం ద్వారా రాష్ట్ర సంప్రదాయాలు, వారసత్వ సంపదను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా పరిచయం చేయడానికి పర్యాటక శాఖ కృషి చేసింది.

ఇలాంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ రాష్ట్ర జీవన సంప్రదాయాలను ప్రోత్సహించడం, స్థానిక కళాకారులకు గుర్తింపు కల్పించడం, చరిత్ర, వారసత్వం, ఆధ్యాత్మికత, ప్రకృతి సౌందర్యం, సాంస్కృతిక వైవిధ్యంతో కూడిన పర్యాటక గమ్యస్థానంగా తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పడం కొనసాగిస్తోంది.

# ఆధ్యాత్మిక కేంద్రం ముసుగులో వేధింపులు

**హైదరాబాద్, అక్టోబర్ 14:**

ఆధ్యాత్మిక సాధన పేరుతో ఓ కుటుంబంలో వివాదం తలెత్తిన ఘటన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో వెలుగుచూసింది. ఆధ్యాత్మిక కేంద్రానికి వచ్చే మహిళకు అసభ్యకరమైన సందేశాలు పంపడంతో పాటు, ప్రశ్నించిన ఆమె భర్తను బెదిరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్రం నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 71లో 'శ్రీవిద్యా సాధనా సెంటర్' పేరుతో మేరెడ్డి సునీల్‌రెడ్డి అలియాస్ శ్రీచైతన్య గురూజీ ఆధ్యాత్మిక కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. స్రవంతి నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విష్ణుదీప్‌రెడ్డి భార్య మానసిక ప్రశాంతత కోసం ఈ కేంద్రానికి వెళ్తుండేది. ఈ క్రమంలో కేంద్రం నిర్వాహకుడు ఆమెకు అసభ్యకరమైన సందేశాలు పంపుతూ, వ్యక్తిగతంగా చాటింగ్ చేసినట్లు విష్ణుదీప్‌రెడ్డి ఆరోపించారు.

**ప్రశ్నించడంతో బెదిరింపులు**

తన భార్యకు పంపిన సందేశాలను గుర్తించిన విష్ణుదీప్‌రెడ్డి.. కేంద్రానికి వెళ్లి నిర్వాహకుడిని ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో తనను చంపేస్తానని, మళ్లీ అక్కడికి వస్తే ప్రాణాలతో వదిలిపెట్టనని బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆధారాలను సేకరించిన ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో జూబ్లీహిల్స్ పోలీసులు సునీల్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరపూరిత బెదిరింపులకు సంబంధించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఆరోపణలపై పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉంది.

# గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌కు తరలిరండి

**హైదరాబాద్, అక్టోబర్ 14 :**

తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు అనుగుణంగా డిసెంబర్ 7 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ 2026లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణ లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్ 2026'కు ఆయన గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, నూతన పరిశ్రమలకు ప్రోత్సాహం, వ్యాపారాలకు అనుకూల వాతావరణం కల్పించడంపై దృష్టి సారించామన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ మరింత కీలక పాత్ర పోషించేలా పరిశ్రమలు, నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఐటీ, సాంకేతిక రంగాలను మరింత అభివృద్ధి చేయడంతోపాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ తయారీ రంగం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటును ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్‌తోపాటు ఏఐ, ఏరోస్పేస్, రక్షణ రంగం, అధునాతన తయారీ లాంటి రంగాలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు.

# ప్రపంచస్థాయి సాంకేతికతతో జౌళి రంగానికి కొత్త దిశ

**హైదరాబాద్, అక్టోబర్ 14 :** రాష్ట్రంలో చేనేత, జౌళి రంగాన్ని ఆధుని క సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానిస్తూ టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రముఖ విద్యా, పరిశ్రమ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక అవగాహన ఒప్పందాలను బుధవారం కుదుర్చుకుందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తద్వారా టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడంతోపాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడం, పరిశ్రమలకు అవసరమైన శిక్షణను అందించడం, ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు.

**హడర్స్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయంతో తొలి ఎంఓయు**

యునైటెడ్ కింగ్‌డమ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హడర్స్‌ఫీల్డ్, తెలంగాణ ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ మధ్య కుదిరిన తొలి అవగాహన ఒప్పందం ద్వారా రాష్ట్రంలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పరిశోధన, అభివృద్ధికి సహకారం అందనుంది. ఉమ్మడి విద్యా కార్యక్రమాల నిర్వహణకు అవకాశాలను అన్వేషించడం, విజిటింగ్ అకడమిక్ సిబ్బంది నియామకం, అధ్యాపకులు, విద్యార్థుల పరస్పర మార్పిడిని ప్రోత్సహించడం వంటివి ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం అని మంత్రి పేర్కొన్నారు. అలాగే టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పురోగతికి అవసరమైన సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ఈ భాగస్వామ్యం దోహదపడనుందన్నారు.

**టెక్స్‌టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో రెండో ఒప్పందం**

యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన టెక్స్‌టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలోని చేనేత, జౌళి, హస్తకళల విభాగం రెండో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీని ద్వారా టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో వృత్తి విద్య, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా 3డి వీవింగ్, కాంపోజిట్ మెటీరియల్స్ వంటి ఆధునిక సాంకేతిక వస్త్రాల తయారీ, పరిశోధన, శిక్షణపై దృష్టి సారించనున్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి, వాటికి అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలను రూపొందించడం, అంతర్జాతీయ నైపుణ్య ప్రమాణాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్దడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం అన్నారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్యాభివృద్ధి**

టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో ప్రపంచ స్థాయి నైపుణ్య ప్రమాణాలను రాష్ట్రంలో అమలు చేసే అవకాశాలను పరిశీలించడం తోపాటు, పరిశ్రమలు, శిక్షణ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించనున్నారు.

## స్థలం కొనుగోలు ప్రకటన

బైరెడ్డి రవీందర్ రెడ్డి, తండ్రి పేరు దేవేందర్ రెడ్డి గారికి చెందిన స్వంత స్థలాన్ని నేను, నారెడ్డి జీవన్ రెడ్డి, వయస్సు 40 సంవత్సరాలు, తండ్రి పేరు సమ్మి రెడ్డి, నివాసం గోదావరిఖని, మార్కెట్ ధరకు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నాను.

**స్థలం వివరాలు:**
**- ప్లాట్ నంబర్: 258**
**- డాక్యుమెంట్ నంబర్: 4172/2017**
**- సర్వే నంబర్లు: 245, 268, 269, 270, 271, 272, 273**
**- గ్రామం: అత్వెల్లి**
**- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం: మేడ్చల్**

పై స్థలానికి సంబంధించి ఎవరికైనా ఏవైనా హక్కులు, అభ్యంతరాలు లేదా ఇతర క్లెయిమ్‌లు ఉన్నట్లయితే, తగిన ఆధారాలతో వెంటనే క్రింద పేర్కొన్న ఫోన్ నంబర్‌కు తెలియజేయగలరు.

సెల్ నంబర్: 7304768353

**ఇట్లు,**
**నారెడ్డి జీవన్ రెడ్డి**
**స్థలం కొనుగోలుదారు**

# మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో భార్యకు ఉరిశిక్ష

- ముస్కాన్ రస్తోగి, సాహిల్ శుక్లాలకు మరణశిక్ష విధించిన కోర్టు
- తీర్పులో భగవద్గీత, ధర్మసూత్రాలను ప్రస్తావించిన న్యాయమూర్తి
- భర్త సౌరభ్‌ను హత్య చేసి ముక్కలుగా నరికి డ్రమ్‌లో వేసిన నిందితులు
- 126 విచారణలు.. 22 మంది సాక్షుల వాంగ్మూలాల పరిశీలన



**మీరట్, అక్టోబర్ 14:**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మీరట్ 'బ్లూ డ్రమ్ హత్య' కేసులో న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. భర్త సౌరభ్ రాజ్‌పుత్‌ను హత్య చేసిన కేసులో భార్య ముస్కాన్ రస్తోగి, ఆమెకు సహకరించిన సాహిల్ శుక్లాలకు ఉరిశిక్ష విధించింది. బుధవారం తీర్పు వెలువరిస్తూ న్యాయమూర్తి అరవింద్ కుమార్ మిశ్రా మహాభారతంలోని భగవద్గీతలోని ధర్మసూత్రాలను ప్రస్తావించినట్లు బాధితుడి తరఫు న్యాయవాది మీడియాకు వెల్లడించారు. తీర్పు సందర్భంగా తప్పు చేసిన వారిని శిక్షించడం ధర్మంలో భాగమనే భావనను న్యాయమూర్తి ప్రస్తావించినట్లు న్యాయవాది తెలిపారు. కురుక్షేత్ర యుద్ధ సమయంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన ఉపదేశాన్ని ఉదహరించారు. సొంత వారితోనే యుద్ధం చేయాల్సి వస్తుందన్న ఆందోళనలో ఉన్న అర్జునుడికి కర్తవ్యం, ధర్మం గురించి శ్రీకృష్ణుడు వివరించిన అంశాలను న్యాయమూర్తి గుర్తుచేసినట్లు చెప్పారు.

**డ్రమ్‌లో మృతదేహం ముక్కలు**

విదేశాల్లో మర్చంట్ నేవీ అధికారిగా పనిచేస్తున్న సౌరభ్ రాజ్‌పుత్ భారత్‌కు వచ్చిన కొద్దిరోజులకే హత్యకు గురయ్యాడు. భోజనంలో మత్తు పదార్థాలు కలిపి, అనంతరం అతడిని హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా నరికినట్లు కేసులో ఆరోపణలు ఉన్నాయి. ఆ ముక్కలను డ్రమ్‌లో వేసి సిమెంట్‌తో కప్పిపెట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో మొత్తం 126 సార్లు విచారణ జరగగా, 22 మంది సాక్షుల వాంగ్మూలాలను కోర్టు పరిశీలించింది. తీర్పుకు ముందు ముస్కాన్ తల్లిదండ్రులు సైతం తమ అల్లుడు సౌరభ్ మంచి వ్యక్తి అని పేర్కొన్నట్లు సమాచారం. దోషులకు మరణశిక్ష విధించినా తాము వ్యతిరేకించబోమని వారు చెప్పినట్లు కథనాలు వెల్లడించాయి.

# యూట్యూబర్ ధ్రువ్ రాఠీని వెంబడిస్తున్న కేసులు..

- ఎనిమిదేళ్ల నాటి కేసులో కొత్తగా సమన్లు..
- వివిధ కేసులు నమోదు..



**న్యూ ఢిల్లీ, అక్టోబర్14:**

ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీని పాత కేసులు వెంబడిస్తున్నాయి. ఆయన మరోసారి న్యాయపరమైన చిక్కుల్లో చిక్కుకున్నాడు. 8 ఏళ్ల నాటి కేసులో ఆయనకు కొత్తగా సమన్లు జారీ చేయాలని ఢిల్లీ సాకేత్ కోర్టు ఆదేశించింది. గురుగ్రామ్‌లోని ఆయన ఇంటి చిరునామాలో సమన్లను అందించాలని సూచించింది. ఈ కేసు తదుపరి విచారణ అక్టోబర్ 17న జరుగుతుంది. వికాస్ పాండే అనే వ్యక్తి గతంలో దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ సమన్లు జారీ చేశారు. ధ్రువ్ రాఠీ న్యాయపరమైన చిక్కుల్లో పడటం ఇదే తొలిసారి కాదు. ఆయనపై ఇతర కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. బీజేపీ నాయకుడు సురేష్ కరమ్షి నఖువా, ధువ్ రాఠీపై సాకేత్ కోర్టులో రూ. 20 లక్షల పరువు నష్టం దావా వేశారు. జూలై 2024లో ధ్రువ్ రాఠీ అప్‌లోడ్ చేసిన ఒక వీడియోలో తనను "హింసాత్మక, దూషణాత్మక ట్రోలర్" అని పిలిచాడని ఆరోపించాడు. ఈ కేసులో గతంలో కోర్టు సమన్లు జారీ చేసింది. హిందూ దేవీదేవతలపై, సనానత ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ధ్రువ్ రాఠీపై అమిత్ సచ్‌దేవ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 196, 299 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆయన కోరారు

# నాణ్యతా ప్రమాణాల్లో నాలుగు గుర్తింపులు

- కీలక మైలురాయి అధిగమించిన ఎస్పీడీసీఎల్
- విద్యుత్ పంపిణీ రంగంలో మరో ముందడుగు
- డిప్యూటీ సీఎం చేతుల మీదుగా గుర్తింపులు స్వీకరించిన సీఎండీ

**అచ్చంపేట, అక్టోబర్ 14 :**

విద్యుత్ పంపిణీ రంగంలో నాణ్యతా ప్రమాణాల అమలు, సమాచార భద్రత, స్టోర్స్ నిర్వహణ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎస్పీడీసీఎల్) మరో కీలక మైలురాయిని అధిగమించింది. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా సంస్థకు నాలుగు గుర్తింపులు లభించాయి. నాణ్యతా నిర్వహణకు సంబంధించి ఐఎస్‌వో 9001, సమాచార భద్రతకు ఐఎస్‌వో 27001, స్టోర్స్ నిర్వహణలో జపనీస్ 5ఎస్ విధానం, వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తున్నందుకు క్వాలిటీ మార్క్ గుర్తింపులు దక్కాయి. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్ ఈ నాలుగు గుర్తింపులను స్వీకరించారు. ఐఎస్‌వో ఆడిటర్ శివయ్య సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) డాక్టర్ ఎన్.నర్సింహులు, కంపెనీ సెక్రటరీ అనిల్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ (రూరల్) బాలస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు

**నాణ్యతా నిర్వహణకు ఐఎస్‌వో 9001**

సంస్థలోని కార్యాలయాలు, వివిధ విభాగాల్లో నాణ్యతా నిర్వహణ విధానాలను సమర్థంగా అమలు చేయడం, రికార్డుల నిర్వహణ, అంతర్గత నియంత్రణ, పర్యవేక్షణ, కార్యాచరణ ప్రక్రియలను మెరుగుపరచడం, నిరంతర అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలకు సంబంధించి ఐఎస్‌వో 9001 గుర్తింపు లభించింది. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా విధులను నిర్వర్తిస్తూ సేవల నాణ్యతను ఎప్పటికప్పుడు మెరుగుపరచడానికి ఈ ప్రమాణం దోహదపడుతుంది. సంస్థలో జవాబుదారీతనం పెంపొందించడంతోపాటు వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు అవసరమైన నిర్వహణ విధానాలకు ఇది ప్రాధాన్యతనిస్తుంది.

**సమాచార భద్రతకు పెద్దపీట**

ప్రస్తుత డిజిటల్ యుగంలో సమాచార భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఉంది. విద్యుత్ పంపిణీ వ్యవస్థకు సంబంధించిన ఐటీ నెట్‌వర్క్‌లు, కీలక సమాచారం, డేటా పరిరక్షణ, సమాచార ప్రాప్యతపై నియంత్రణ, సైబర్ ముప్పుల నిర్వహణ వంటి అంశాల్లో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తున్నందుకు ఐఎస్‌వో 27001 గుర్తింపు లభించింది. సంస్థ సమాచార గోప్యత, సమగ్రతను కాపాడటంతోపాటు అవసరమైన సమయంలో సమాచారాన్ని అందుబాటులో ఉంచేందుకు ఈ ప్రమాణం ఉపయోగపడుతుంది.

# జంతర్‌మంతర్‌పై పోరాటం మరింత ఉధృతం!

- 16న జాతీయ పతాకాలతో భారీ నిరసనకు అభిజీత్ దీప్కే పిలుపు
- సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీ
- నిరసన హక్కును తిరిగి సాధిస్తామన్న రాహుల్ గాంధీ
- ఢిల్లీలో విద్యార్థి, యువజన సంఘాల ప్రదర్శనలు
- 24 గంటల్లో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని ఇండియా కూటమికి పిలుపు
- హైదరాబాద్‌లో భారీ సభకు సన్నాహాలు
- నిరసనలపై ఐక్యరాజ్యసమితి వ్యాఖ్యలను తిరస్కరించిన కేంద్రం



**ఢిల్లీ | అక్టోబర్ 14 :**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, వోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిలిపివేత డిమాండ్లతో దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలు బుధవారం మరింత ఉధృతమయ్యాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో నిరసన చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. ఈ పరిణామాల మధ్య అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వద్ద జాతీయ పతాకాలతో భారీ ప్రదర్శన నిర్వహించాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు.

**జాతీయ పతాకంతో నిరసన నేరమా?**

మంగళవారంనాడు జంతర్‌మంతర్‌లోకి ప్రవేశించి నిరసన చేపట్టిన సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్య షిండే సహా 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో దాస్, రాంకాలను బుధవారం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించారు. అనంతరం తిహార్ జైలుకు తరలించారు. అజింక్య షిండేను ఆరు నెలలపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోమన్న షరతుతో రూ.5,000 వ్యక్తిగత పూచీకత్తు, ష్యూరిటీపై విడుదల చేశారు. జంతర్‌మంతర్‌ను అధికారిక నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించిన తర్వాత అనుమతి లేకుండా అక్కడికి ప్రవేశించారని పోలీసులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇచ్చిన శాంతిభద్రతల పూచీకత్తు నిబంధనలను ఉల్లంఘించడంతోపాటు ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి కన్నాట్ ప్లేస్, పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్లలో రెండు కేసులు నమోదయ్యాయి. అయితే నిరసనకారులు తాము శాంతియుతంగా జాతీయ పతాకాన్ని ప్రదర్శించామని చెబుతున్నారు.

**16న కన్నాట్ ప్లేస్‌లో నిరసన**

బుధవారం ఢిల్లీకి చేరుకున్న అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ సహచరుల నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు. దేశంలో జాతీయ పతాకాన్ని ఎగురవేయడం నేరంగా మారిందా అని ప్రశ్నించారు. బ్రిటిష్ పాలనలో స్వాతంత్ర్య సమరయోధులను నిర్బంధించిన పరిస్థితులతో ప్రస్తుత చర్యలను పోల్చారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌కు జాతీయ పతాకాలతో రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ పతాకాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేస్తామని ప్రకటించారు. అయితే ఈ ప్రదర్శనకు పోలీసుల అనుమతి లభించిందా అన్న విషయం ఇంకా ధ్రువీకరణ కాలేదు. సీజేపీ స్వతంత్ర ప్రజా ఒత్తిడి సంఘంగానే కొనసాగుతుందని, రాజకీయ పార్టీగా నమోదు చేసుకునే ఆలోచన లేదని దీప్కే స్పష్టం చేశారు. ఇండియా కూటమితో కలిసి పనిచేసే అంశంలో ఉమ్మడి లక్ష్యాలు ఉన్నప్పటికీ తమ స్వతంత్రతను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

**24 గంటల్లో ఉద్యమానికి సిద్ధంగా ఉండండి: రాహుల్ గాంధీ**

సీజేపీ నాయకుల నిర్బంధాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బుధవారం తీవ్రంగా ఖండించారు. శాంతియుత నిరసన సందర్భంగా జాతీయ పతాకాన్ని ప్రదర్శించడం నేరం కాదన్నారు. యువతను జైలుకు పంపడం పిరికితనానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి వేర్వేరు వేదికలపై పోరాడుతున్నప్పటికీ రాజ్యాంగ హక్కుల పరిరక్షణే అందరి ఉమ్మడి లక్ష్యమని ప్రకటించారు. జంతర్‌మంతర్ ప్రజలదేనని, నిరసన హక్కును తిరిగి సాధించుకుంటామని స్పష్టం చేశారు. ఢిల్లీలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఇండియా కూటమి నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, పౌరసమాజ కార్యకర్తలు పాల్గొన్నారు. అవసరమైతే 24 గంటల్లో భారీ ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. జంతర్‌మంతర్‌ను అధికారిక నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించిన నిర్ణయాన్ని న్యాయపరంగా సవాలు చేయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. మరో కార్యక్రమంలో పోలీసుల దాడులకు గురయ్యామని ఆరోపిస్తున్న నిరసనకారులతో కలిసి రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. పోలీసు చర్యలకు సంబంధించిన వీడియో ఆధారాలను భద్రపరచి తనకు పంపించాలని కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

దిల్లీలో విద్యార్థి, యువజన సంఘాల ప్రదర్శనలు

దిల్లీలో విద్యార్థి, యువజన సంఘాల నిరసనలు బుధవారం కొనసాగాయి. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ), డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ) సంయుక్తంగా ఫిరోజ్ షా రోడ్డు నుంచి జంతర్‌మంతర్ వైపు నిర్వహించిన ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై విచారణ జరిపించాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కూడా మధ్యాహ్నం పటేల్ చౌక్ మెట్రో స్టేషన్ నుంచి జంతర్‌మంతర్ వైపు ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఎన్ఎస్‌యూఐ నాయకులు పోలీసులపై ఫిర్యాదు చేసేందుకు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది.

**సీజేపీకి విస్తరిస్తున్న ప్రతిపక్షాల మద్దతు**

సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల నిర్బంధాన్ని రాహుల్ గాంధీతోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ బెనర్జీ, శివసేన( యూబీటీ) నాయకుడు ఆదిత్య ఠాక్రే తదితరులు ఖండించారు. జాతీయ పతాకాన్ని ప్రదర్శించినందుకు నిర్బంధించడం సమంజసం కాదని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. నిర్బంధితులకు న్యాయ సహాయం అందించేందుకు డీఎంకే సిద్ధంగా ఉందని స్టాలిన్ ప్రకటించారు.ఈ మద్దతుపై అభిజీత్ దీప్కే ప్రతిపక్ష నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే సీజేపీ ఇండియా కూటమిలో అధికారికంగా చేరినట్లు ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

**హైదరాబాద్‌లో భారీ సభకు సన్నాహాలు**

తెలంగాణలోనూ నిరసనలను మరింత విస్తరించేందుకు ఇండియా కూటమి సన్నాహాలు చేస్తోంది. దసరా తర్వాత హైదరాబాద్‌తోపాటు దేశంలోని ప్రధాన నగరాల్లో భారీ ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో జరగనున్న కార్యక్రమానికి రాహుల్ గాంధీతోపాటు ఇండియా కూటమి అగ్రనేతలు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. అయితే హైదరాబాద్ సభ తేదీ, వేదిక ఇంకా ఖరారు కాలేదు.కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి జంతర్‌మంతర్‌పై ఆంక్షలను విమర్శించారు. ఒక నిరసన స్థలాన్ని తొలగిస్తే దేశవ్యాప్తంగా వందలాది నిరసన కేంద్రాలు ఏర్పడతాయని వ్యాఖ్యానించారు.

**ఐక్యరాజ్యసమితి వ్యాఖ్యలను తిరస్కరించిన కేంద్రం**

దిల్లీలో నిరసనకారుల సామూహిక నిర్బంధాలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం వ్యక్తం చేసిన ఆందోళనలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం తిరస్కరించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ ఆ వ్యాఖ్యలు అనుచితమైనవని, భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యంగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఇతర దేశాల్లో జరిగే నిరసనలపై ఇదే విధంగా స్పందించకుండా భారతదేశాన్ని ప్రత్యేకంగా విమర్శించడం పక్షపాత వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.

**నిరసనలతో వ్యాపారానికి నష్టం: వర్తక సంఘాలు**

దిల్లీలో నిరసనలు, పోలీసుల బారికేడ్లు, ట్రాఫిక్ ఆంక్షల కారణంగా వ్యాపార కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని పలు వర్తక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఖాన్ మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షుడు సంజీవ్ మెహ్రా ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో సాధారణ వ్యాపారంతో పోలిస్తే అమ్మకాలు 80 నుంచి 90 శాతం వరకు తగ్గాయి. ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పలు సంఘాలు వినతిపత్రాలు సమర్పించాయి. శాంతియుత నిరసన హక్కును గౌరవిస్తూనే చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీల జీవనోపాధిని కాపాడాలని కోరాయి.

**రేపు సుప్రీంకోర్టు విచారణ కీలకం**

ఈనెల 10 నుంచి జరిగిన నిరసనల సందర్భంగా పోలీసుల చర్యలు, నిర్బంధాలు, రవాణా ఆంక్షలు, మహిళా జర్నలిస్టులపై దాడుల ఆరోపణలకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టు ముందున్నాయి. మహిళా జర్నలిస్టులపై దాడుల ఆరోపణలకు సంబంధించి సీనియర్ ఢిల్లీ పోలీసు అధికారి వివరణ ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఇప్పటికే కోరారు. అక్టోబర్ 15న ఈ అంశంపై తదుపరి విచారణ జరగాల్సి ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా దిల్లీలో గురువారంనిరసన, నిరాహార దీక్ష కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని పార్టీ నాయకులు ప్రకటించారు.

# రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్..

- ఒక్కొక్కరికి రూ.17,951
- 11.40 లక్షల మందికి పైగా నాన్-గెజిటెడ్ ఉద్యోగులకు లబ్ధి
- బోనస్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం.. రూ.2,009 కోట్ల వ్యయం
- కనీస వేతన పరిమితి రూ.7 వేల నుంచి రూ.18 వేలకు పెంచాలని యూనియన్ల డిమాండ్
- పరిమితి పెంచితే ఒక్కొక్కరికి రూ.46,184 బోనస్ ఇవ్వాలని విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:**

పండుగల వేళ రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దేశవ్యాప్తంగా 11.40 లక్షల మందికి పైగా నాన్‌గెజిటెడ్ రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనానికి సమానమైన పనితీరు ఆధారిత బోనస్ (పీఎల్‌బీ) చెల్లించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం వెల్లడించారు. ఈ నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంపై సుమారు రూ.2,009 కోట్ల ఆర్థిక భారం పడనుంది.

**రైల్వే ఉద్యోగుల సేవలకు గుర్తింపు**

దేశ రవాణా వ్యవస్థ నిరంతరాయంగా పని చేసేందుకు రైల్వే ఉద్యోగులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. పండుగల సమయంలోనూ ట్రాక్‌ల నిర్వహణ, రైళ్ల నడపడం, వర్క్‌షాపుల్లో పనులు సహా వివిధ విధుల్లో నిమగ్నమయ్యే ఉద్యోగుల సేవలను గుర్తిస్తూ బోనస్ ప్రకటించినట్లు తెలిపారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ఈ నిర్ణయం ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థికంగా ఊరటనివ్వనుంది.

ప్రస్తుతం అమల్లో ఉన్న లెక్కింపు విధానం ప్రకారం కనీస వేతనం రూ.7,000 ప్రాతిపదికన 78 రోజుల బోనస్‌ను లెక్కిస్తున్నారు. ఈ ప్రకారం ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 అందనుంది. ట్రాక్ మెయింటెనర్లు, లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, గార్డులు, టెక్నీషియన్లతో పాటు గ్రూప్‌సి, గ్రూప్‌డి విభాగాల్లోని అర్హులైన నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు ఈ ప్రయోజనం పొందనున్నారు.

**వేతన పరిమితి పెంచాలని డిమాండ్**

బోనస్ లెక్కింపునకు ప్రామాణికంగా తీసుకుంటున్న కనీస వేతన పరిమితిని పెంచాలని రైల్వే కార్మిక సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రూ.7,000 పరిమితి 201415 నుంచి కొనసాగుతోందని, గత 11 ఏళ్లుగా మార్పు చేయలేదని ఐఆర్‌టీఎస్‌ఏ సహా పలు సంఘాలు పేర్కొంటున్నాయి. పెరుగుతున్న జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పరిమితిని రూ.18,000కు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు బోనస్‌ను లెక్కిస్తే ఒక్కో ఉద్యోగికి రూ.46,184 చొప్పున అందించాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.





# సీజేపీ నేతలకు ఐదు రోజుల కస్టడీ

- ఆంక్షలు ఉల్లంఘించి మళ్లీ ఆందోళనకు ప్రయత్నించారని ఆరోపణలు
- రూ.50 వేల వ్యక్తిగత బాండ్లపై గతంలో సంతకాలు చేసినట్లు పోలీసుల వెల్లడి
- అక్టోబర్ 19కు తదుపరి విచారణ వాయిదా

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనకు ప్రయత్నించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కోకన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ మహేష్ కుమార్ మీనా ఆదేశాలు జారీ చేశారు. గతంలో శాంతిభద్రతలను కాపాడుతామని బాండ్లు సమర్పించినప్పటికీ, మళ్లీ నిషేధిత ప్రాంతంలో నిరసనకు ప్రయత్నించారని మేజిస్ట్రేట్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అక్టోబర్ 14న వెలువడిన ఈ ఆదేశాల ప్రకారం తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

**బాండ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు**

అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద నిరసనకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో వచ్చిన అభిజీత్ దిప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నారు. మరుసటి రోజు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందన్న కారణంతో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్లు 126, 170 కింద ముందస్తు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆ సమయంలో ముగ్గురూ శాంతి, సత్ప్రవర్తనను కాపాడేందుకు ఒక్కొక్కరు రూ.50 వేల వ్యక్తిగత బాండ్, ష్యూరిటీ బాండ్ సమర్పించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఏడాదిపాటు శాంతిభద్రతలను కాపాడతామని వారు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అయితే, తాము ఎలాంటి బాండ్లపై సంతకాలు చేయలేదని సీజేపీ నేతలు చెబుతున్నారు.

**జేడీయూ కార్యాలయం గోడ దూకి..**

అక్టోబర్ 13న కొందరితో కలిసి సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు జేడీయూ కార్యాలయం గోడ దూకి జంతర్ మంతర్ ప్రాంతానికి చేరుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ నినాదాలు చేస్తూ అంతరాయం కలిగించడంతో పాటు ఆంక్షలను ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇద్దరినీ ఐదు రోజుల కస్టడీకి పంపిస్తూ మేజిస్ట్రేట్ ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు సీజేపీ నేత అజింక్య షిండేకు ఆరు నెలల పాటు శాంతి, సత్ప్రవర్తనను కాపాడాలనే షరతుతో రూ.5 వేల వ్యక్తిగత బాండ్, ష్యూరిటీపై విడుదల చేసినట్లు పోలీసులు వెల్లడించారు.



# పట్టభద్రులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి: డీసీసీ కార్యదర్శి బండారి రవీందర్
- బండారి రవీందర్, పాశం బుచ్చి యాదవ్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం ఏర్పాటు
- ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ హాజరు



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ బండారి రవీందర్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హత కలిగిన పట్టభద్రులు తమ వివరాలను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.బండారి రవీందర్, పాశం బుచ్చి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి సహా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదుపై నాయకులు అవగాహన కల్పిస్తూ, అర్హులైన పట్టభద్రులు నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ద్వారా ఎన్నికల ప్రక్రియలో తమ భాగస్వామ్యాన్ని నిర్ధారించుకోవచ్చని పేర్కొన్నారు. అర్హత ఉన్నవారు అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత అధికారిక నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు ప్రాధాన్యం ఉంటుందని, ముఖ్యంగా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరు జాబితాలో పేరు ఉండటం అవసరమని నాయకులు వివరించారు. ఈ దిశగా పట్టభద్రులకు అవగాహన కల్పిస్తూ, నమోదు ప్రక్రియలో వారికి అవసరమైన సమాచారం అందించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పట్టభద్రుల ఓటరు నమోదు ప్రాధాన్యాన్ని వివరించారు. అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని బండారి రవీందర్ కోరారు.

## ఎస్‌బీ 459 మొక్కజొన్న విత్తనాలతో అధిక దిగుబడులు

**తక్కువ వర్షపాత పరిస్థితుల్లోనూ మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం: ఎల్ఎస్ఆర్ సీడ్స్ ప్రతినిధులు**




**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఎల్ఎస్ఆర్ సీడ్స్ సంస్థకు చెందిన ఎస్‌బీ 459 మొక్కజొన్న విత్తనాలు వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ రైతులకు మెరుగైన దిగుబడులు అందించగలవని ఆ సంస్థ రీజినల్ బ్రాంచ్ మేనేజర్ వి. రమణారెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చర్లపల్లి గ్రామంలో రైతు శంకర్ పొలంలో సాగు చేస్తున్న ఎస్‌బీ 459 మొక్కజొన్న పంటను పరిశీలిస్తూ బుధవారం రైతు క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, ఈ వంగడం తక్కువ వర్షపాతం పరిస్థితుల్లోనూ పంట దిగుబడికి అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఈ రకం మొక్కజొన్న తక్కువ పంటకాలంలోనే చేతికి వచ్చే అవకాశం ఉండటంతో పాటు, కొన్ని రకాల పురుగులను తట్టుకునే లక్షణాలు కలిగి ఉందని తెలిపారు. దీంతో రైతులకు క్రిమిసంహారక మందుల ఖర్చులు తగ్గే అవకాశం ఉందన్నారు. అలాగే మొక్కజొన్న కంకుల వలుచుట సులభంగా ఉండటం వల్ల కూలీల ఖర్చులు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. త్వరగా పంట చేతికి రావడం వల్ల తదుపరి పంట సాగుకు అవకాశం కలుగుతుందని వివరించారు. రైతులు తమ ప్రాంతంలోని వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, సాగునీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని తగిన విత్తన రకాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మంజునాథ ట్రేడర్స్‌కు చెందిన వి. కుమార్ గౌడ్, కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ రాజశేఖర్ గౌడ్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**




**రాజముద్ర న్యూస్, ఖమ్మం:** ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్లో ఉన్న నోటీసుల పంపిణీ, ఓటర్ల విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,75,841 నోటీసులకు గాను 99.07 శాతం పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఇంకా 1,630 నోటీసుల పంపిణీ పెండింగ్లో ఉందని, ఇప్పటివరకు 1,58,144 మంది ఓటర్ల విచారణ పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలిన విచారణలను నవంబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ల నుంచి స్వీకరించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చాలని ఆదేశించారు. జిల్లాలో ఫారం-6కు సంబంధించి 6,435 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. ఈ దరఖాస్తులను సమీక్షించి వచ్చే వారంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 27వేల మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. గతంలో 84 వేల మంది ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. ఈసారి కనీసం రెండు లక్షల మంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఓటరు నమోదు అర్హతలు, దరఖాస్తు విధానంపై పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలు, కేబుల్ ఛానళ్ల ద్వారా ప్రచారం చేయాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా అర్హులైన గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పించి నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ ఎన్.శ్రీనివాస్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎంఏ.రాజు, డీటీ అన్సారీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.వేణుగోపాల్, ఎం.రమేష్, ఎ.సతీష్ బాబు, అన్నెం గోపాల్ రావు, వి.రాజేష్, స్వర్ణ సుబ్బారావు, వేల్పుల రామయ్య, ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా నేలకొండపల్లి మండల అధ్యక్షుడిగా పిట్టల సూరిబాబు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి,భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో భైరవునిపల్లి గ్రామంలో జరిగింది.ఈ సమావేశంలో బీజేపీ నేలకొండపల్లి మండల ఓ బి సి మోర్చా అధ్యక్షుడిగా పిట్టల సూరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ, పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలన గురించి, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీసీలకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. అంతేకాకుండా రజక సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ శ్రీ బ్రజ్ మోహన్ రాయ్ గారు ఒడిశా నూతన గవర్నర్ గా నియమితులు కావడం సంతోషించదగ్గ, గర్వించదగ్గ విషయమన్నారు.ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి లింగనబోయిన వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, నాయకులు సూరెపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మొహినుద్దీన్, కందరబోయిన గోపి, ఏపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎండిన వరి పంటలను పరిశీలించిన సొసైటీ చైర్మన్ లింగ గౌడ్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గోకుల్ తండ గ్రామంలో బుధవారం రోజున ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బొంబోతుల లింగ గౌడ్, డైరెక్టర్లు, అధికారులు ఎండిన వరి పంటలను పరిశీలించారు సరైన కరెంటు లేక నీరు లేక గోకుల్ తండాలో 450 ఎకరాల వరి పొలాలు ఉండగా, వందల ఎకరాలు వరి పంటలు ఎండిపోయాయని రైతులు ఆవేదన చెందారు, ఎండిన పంటలకు ప్రభుత్వం తరపున నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోహన్ నాయక్, తాసిల్దార్ ఉమలత , ఏవో భాను శ్రీ, ఏఈఓ రాణి, డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, లింభారెడ్డి, అంజల్ రెడ్డి, రవి గౌడ్, సిద్ధ గౌడ్, నర్సింలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఘాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్పర్సన్



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పట్టణ ప్రజలు, మహిళలు ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరుపుకునేలా అన్ని మౌళిక వసతులు కల్పించాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని వివిధ బతుకమ్మ నిమజ్జన ఘాట్లను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖానాపూర్, కుమ్మరివాడ, దుర్గానగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లోని బతుకమ్మ ఘాట్లను సందర్శించి, అక్కడ జరుగుతున్న ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ నిమజ్జనానికి వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఘాట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా నిరంతరం శుభ్రపరిచే పనులు చేపట్టాలని, పారిశుధ్య సిబ్బంది షిఫ్టుల వారీగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది, ఇంజినీరింగ్ విభాగం అధికారులు తదితరులు ఉన్నారు.

## ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

**ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహణ : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజముద్ర న్యూస్, సిరిసిల్ల:** రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈనెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని వారు, తొలిసారిగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే అర్హులైన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాలను సందర్శించి, ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ శిబిరాల్లో సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**రాజముద్ర న్యూస్, తాండూర్:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి సహకారంతో డీఎంఎఫ్టీ నిధుల ద్వారా తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 12వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను తాండూర్ గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో భాగంగా మౌళిక సదుపాయాల కల్పనకు చేపడుతున్న ఈ సీసీ రోడ్డు పూర్తయితే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ ఈసా, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు రెండ్ల అశోక్, భాస్కర్ గౌడ్, కంపెల శ్రీనివాస్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో చిన్నారుల ఎదుగుదల



**రాజముద్ర న్యూస్, జైనూర్:** చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని సర్పంచ్ తొడసం రాజేందర్ అన్నారు. మండలంలోని పవర్గూడ గ్రామపంచాయతీ పరిధిలో గల అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు బుధవారం చిక్కీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిపారు. పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం ద్వారా వారి శారీరక ఎదుగుదల, ఆరోగ్యం మెరుగుపడతాయని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



**రాజముద్ర న్యూస్, తాండూర్:** అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు పౌష్టిక ఆహారంతో పాటు మెరుగైన సంరక్షణ అందించాలని తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ అన్నారు. బుధవారం తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో పునఃస్థాపించిన అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన పోషక ఆహారం అవసరమైన సంరక్షణ అందేలా ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. చిన్నారుల ఆరోగ్యం, అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ ఈసా, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, అంగన్వాడీ సూపర్ వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మిక గర్జన మహాసభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



**రాజముద్ర న్యూస్, తాండూర్:** గోదావరిఖనిలో బుధవారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే సింగరేణి కార్మిక గర్జన భారీ బహిరంగ సభకు తాండూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు భారీగా తరలి వెళ్లారు. కార్మిక గర్జన మహాసభకు తరలివెళ్ళిన వారిలో మాజీ జెడ్పిటిసి మంగపతి సురేష్ బాబు, సీనియర్ నాయకులు మహోర్కర్ దత్తాత్రేయ రావు, ఎలుక రామ్ చందర్, మసాడి శ్రీరాములు, గట్టు సంతోష్ కుమార్, మొగిలి శంకర్, మద్దిబోయిన అర్జున్, బోడ సతీష్, క్రిస్టఫర్, ప్రదీప్ రావు, దుర్గం శ్రీనివాస్, చింటూ, బాబు ఖాన్, ఉప్పట్ల సంతోష్, ఇక్బాల్, ఏ సత్యనారాయణ, రాజేష్ తదితర నాయకులు ఉన్నారు.

# ప్రభుత్వానికి ఎన్.హెచ్.ఎం జేఏసీ అల్టిమేటం

- 9 డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమమే
- రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారం లేకుండానే క్రమబద్ధీకరణ సాధ్యం జేఏసీ
- నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల హెచ్చరిక



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన తమను ప్రభుత్వం విస్మరిస్తోందని నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ హెల్త్ మిషన్ – జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడదని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

**జేఏసీ ప్రధాన డిమాండ్లు**

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి ఉద్యోగికి క్యాడర్ స్ట్రెంత్ అమలు చేసి 100శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలి. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి, ఎస్ హెచ్ ఎస్ ద్వారా స్పర్శ లో నేరుగా జీతాలు చెల్లించాలి. 2022 నుండి పెండింగ్‌లో ఉన్న 5 శాతం ఇంక్రిమెంట్, 8 శాతం లాయల్టీ బోనస్ ను వెంటనే విడుదల చేయాలి. మహిళా సిబ్బందికి 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ఆరోపించారు. ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్–గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి. ఉద్యోగ భద్రతతో పాటు ఈ హెచ్ ఎస్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి. ప్రతి నెల 5వ తేదీలోపు క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలి. 9 నెలల పి ఆర్ సి బకాయిలు, ఏరియర్స్ ను వెంటనే విడుదల చేయాలి. జీవో నంబర్ 60, 1195 ప్రకారం పెంచిన వేతనాన్ని వెంటనే అమలు చేయాలి. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు ఉపాధ్యక్షులు కోఆర్డినేటర్లు ట్రెజరీ అన్ని క్యాడర్ల ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఉమ్మడి జిల్లాల ఖో-ఖో శిక్షణ శిబిరం



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలో 18 సంవత్సరాల బాలుర ఖో–ఖో శిక్షణ శిబిరాన్ని అక్టోబర్ 4 తేదీ నుండి 14వ తేదీ వరకు నిర్వహించడం జరిగింది ఈ శిక్షణ కార్యక్రమం గ్రామ సర్పంచ్ కనకంటి శివరాణి రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది దీనికి మద్దతుగా ఆలయ కమిటీ చైర్మన్ గ్రామ పెద్దలు గ్రామ యువత 30 మంది క్రీడాకారులకు 10 రోజులపాటు భోజన సౌకర్యాన్ని ఇతర వసతులు అన్నింటిని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం లో శిక్షకులు అశోక్, సురేష్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణను అందించారు 14 తేదీన ఉత్తమ క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగింది ఎంపిక చేయబడిన క్రీడాకారులకు గ్రామ వాస్తవ్యులు కాలా హరి ఓం క్రీడా దుస్తులనుఅందించారు ఈ ముగింపు శిక్షణ కార్యక్రమంలో నిజాంబాద్ జిల్లా కోకో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అతిక్ మా ట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఇలాంటి క్యాంపులు నిర్వహించడం చాలా హర్షనీయమని తెలియజేశారు ఈ ముగింపు కార్యక్రమంలో నిజాంబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అతిక్ పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంకట స్వామి, ప్రాథమిక పాఠశాల ఇన్చార్జి ఉపాధ్యాయులు జిల్లా కోకో సంఘం ట్రెజరర్ నోముల మధుసూదన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ నరేష్ రెడ్డి, సెపక్ తక్రా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరేష్, వ్యాయామఉపాధ్యాయులు సంజీవులు, లింగం, సురేష్, అశోక్ , గ్రామ యువత అర్బాస్, రవి, జాషువా, ఇర్ఫాన్, అనిల్, సందీప్, గోపి, అశోక్, శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొనడం జరిగింది, ఎంపికైన ఈ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలు రంగారెడ్డి జిల్లా సరూర్నగర్ స్టేడియంలో అక్టోబర్ 15,16,17, తేదీలలో పాల్గొంటారని వ్యాయామఉపాధ్యాయులు అసోసియేషన్ ప్రతినిధులు తెలియజేశారు.

# కుల బహిష్కరణకు వ్యతిరేకంగా అవగాహన

ఎస్సై టి. మురళి



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గోకుల్ తండా గ్రామంలో రామారెడ్డి మండల ఎస్సై టీ. మురళి , తహసీల్దార్ ఉమలత సమక్షంలో గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో గ్రామంలో కుల బహిష్కరణ వంటి సామాజిక వివక్షతకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ సమానత్వం, సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎవరైనా వ్యక్తిని లేదా కుటుంబాన్ని కులం పేరుతో గ్రామం నుంచి వెలివేయడం, సామాజికంగా బహిష్కరించడం, గ్రామంలో జరిగే కార్యక్రమాలకు దూరంగా ఉంచడం, జరిమానాలు విధించడం లేదా ఇతర విధాలుగా ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేయడం జరిగింది. ఇలాంటి చర్యల వల్ల బాధిత వ్యక్తులు, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవడమే కాకుండా గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంటుందని వివరించడం జరిగింది. గ్రామంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం ఉన్నాయని, వ్యక్తిగత అభిప్రాయ భేదాలు లేదా ఇతర వివాదాలు ఉన్నట్లయితే వాటిని చట్టపరిధిలో, పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించడం జరిగింది. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోరాదని, కుల బహిష్కరణ వంటి చర్యలకు ప్రోత్సాహం ఇవ్వకూడదని గ్రామ ప్రజలకు తెలియజేయడం జరిగింది. అలాగే గ్రామంలో శాంతి, సామరస్యం, ఐక్యతను కాపాడుతూ, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఇలాంటి వివక్షపూరిత చర్యలు ఎదురైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించడం జరిగింది అని రామారెడ్డి ఎస్ఐ మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోహన్ నాయక్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య
- సర్వసభ్య సమావేశంలో 18 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో మొత్తం 18 అంశాలను చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాల భవన నిర్మాణాలు, స్థలాల కేటాయింపు, పఠన మందిరాల అభివృద్ధి, మౌళిక వసతుల కల్పన, విద్యుత్ చార్జీలు, ఫర్నిచర్, కంప్యూటర్ పరికరాల కొనుగోలు తదితర అంశాలపై చర్చించారు. జైనథ్, తలమడుగు శాఖా గ్రంథాలయ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధుల ప్రతిపాదనలను ఆమోదించారు. జైనథ్, గుడిహత్నూర్ శాఖా గ్రంథాలయాలకు కేటాయించిన స్థలాలకు సంబంధించి ఆమోదం కోసం సమర్పించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. పౌర పఠన మందిరాల ఏర్పాటుకు చేసిన రూ.3,83,287 వ్యయాన్ని ఆమోదించడంతో పాటు, సామగ్రి కొనుగోలుకు రూ.8 లక్షలు, వార్షిక నిర్వహణకు రూ.4 లక్షల నిధుల ప్రతిపాదనలకు అనుమతి ఇచ్చారు. దాతల విరాళాలతో కంప్యూటర్, ప్రింటర్, ఇన్వర్టర్ తదితర పరికరాల కొనుగోలుకు చేసిన రూ.99,921 వ్యయాన్ని ఆమోదించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కుర్చీలు, అల్మరాలు, టేబుళ్లు, సెప్టిక్ ట్యాంక్ తదితర మౌలిక వసతుల కోసం చేసిన రూ.2,99,250 ఖర్చును, కార్యదర్శి ఛాంబర్కు అవసరమైన ఫర్నిచర్ కోసం చేసిన రూ.47,919 వ్యయాన్ని ఆమోదించారు.జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కేబిన్ ఏర్పాటుకు ఎంపీ గోడం నగేష్ రూ.5లక్షలు మంజూరు చేసినట్లు చైర్మన్ తెలిపారు. అలాగే జిల్లాలోని ఏడు పఠనశాలలకు రూ.1,05,000 విలువైన నిధులు, సామగ్రి అందించేందుకు సంబంధించిన అంశాలను సమావేశంలో పరిశీలించారు. బోథ్ శాఖా గ్రంథాలయానికి దాత అందించనున్న 300 గజాల స్థలం రిజిస్ట్రేషన్, తదితర ఖర్చులను పరిశీలించి, నిబంధనల మేరకు చెల్లింపులు చేపట్టేందుకు కార్యదర్శికి అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రంథాలయాలను కేవలం పుస్తక పఠన కేంద్రాలుగా కాకుండా విద్యార్థులు, యువతకు జ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, ప్రశాంతమైన పఠన వాతావరణం, డిజిటల్ వనరులు అందుబాటులో ఉండేలా గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఈఓ మాధవి, డీపీఓ రమేష్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. సురేష్ బాబు, డిప్యూటీ లైబ్రేరియన్ కృతిన్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బొబ్బిలి ప్రకాష్ రెడ్డి

- పదవి కాదు.. బాధ్యతగా భావిస్తున్నా!
- వెనుకబడిన రెడ్డి వర్గాల హక్కులు, రిజర్వేషన్లు, విద్యార్థుల ఉపకార వేతనాల కోసం పోరాడుతా.. సంఘం బలోపేతానికి కృషి చేస్తా



హైదరాబాద్, అక్టోబర్ 14 (రాజముద్ర) :

తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నల్లగొండ మండలం రాములబండ గ్రామానికి చెందిన యువకుడు, ఉత్సాహవంతుడు, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే బొబ్బిలి ప్రకాష్ రెడ్డి నియమితులయ్యారు. చిన్నప్పటి నుంచే సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తూ, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందుండే ఆయనకు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సమాజ అభ్యున్నతికి, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.

**చిన్ననాటి నుంచే సేవా కార్యక్రమాలపై ఆసక్తి**

నల్లగొండ మండలం రాములబండ గ్రామానికి చెందిన బొబ్బిలి ప్రకాష్ రెడ్డి చిన్నతనం నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. సమాజంలో ఎవరైనా ఆపదలో ఉన్నారని తెలిసినప్పుడు తనవంతు సహాయం అందించేందుకు ముందుకు రావడం, అవసరమైన వారికి అండగా నిలవడం ఆయనలోని సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వామి కావాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్న ఆయనకు తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శి బాధ్య తలు లభించడం ప్రాధాన్యత సంతరించుకుంది. యువత సామాజిక సమస్యలపై అవగాహన పెంచుకొని, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని భావించే ప్రకాష్ రెడ్డి, తనకు లభించిన ఈ అవకాశాన్ని సమాజ సేవకు మరింత విస్తృతమైన వేదికగా మలచుకోవాలని సంకల్పించారు. వ్యక్తిగత ఎదుగుదలతో పాటు సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే తన లక్ష్యమని ఆయన అభిప్రాయపడ్డారు.

**పదవి కాదు.. బాధ్యతగా భావిస్తున్నా!**

తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామకం కావడంపై బొబ్బిలి ప్రకాష్ రెడ్డి స్పందిస్తూ, తనకు లభించిన పదవిని హోదాగా కాకుండా ఒక బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలను అప్పగించిన సంఘం నాయకత్వం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని పేర్కొన్నారు. సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేయడంతో పాటు, సభ్యుల మధ్య ఐక్యతను పెంపొందించి, సమష్టి కార్యాచరణతో ముందుకు సాగేందుకు ప్రయత్నిస్తానని తెలి పారు. రాష్ట్ర కార్యదర్శిగా తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, సంఘం లక్ష్యాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లడం, సామాజిక సమస్యలపై చర్చించడం, వాటి పరిష్కారానికి సంబంధిత వేదికలపై కృషి చేయడం తన ప్రాధాన్యతల్లో ఉంటాయని వివరించారు. యువతను సామాజిక కార్యక్రమాల వైపు ప్రోత్సహిస్తూ, సంఘం కార్యకలాపాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

**వెనుకబడిన వర్గాల హక్కుల సాధనకు కృషి**

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా రిజర్వేషన్ల అంశం, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఉన్నత విద్యకు అవకాశాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూత వంటి అంశాలపై సంఘం తరఫున కృషి చేస్తానని తెలిపారు. విద్య అనేది యువత భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రధాన సాధనమని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకుండా అవసరమైన సహాయ సహకారాలు అందేలా ప్రయత్నించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, ఉపకార వేతనాలపై అవగాహన కల్పించడం, అర్హులకు వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయడం వంటి కార్యక్రమాలకు ప్రాధా న్యం ఇ వ్వాలని భావిస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన వర్గా లకు న్యాయం జరగాలంటే వారి సమస్యలను గుర్తించి, వాటిని సంబంధిత ప్రభుత్వ విభాగాలు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు చట్టబద్ధమైన మార్గాల్లో హక్కుల సాధనకు ప్రయత్నించాలని పేర్కొన్నారు. ఈ దిశగా సంఘం నాయకులు, సభ్యుల సహకారంతో సమష్టిగా ముందుకు సాగుతానని ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు.

**తెలంగాణ రెడ్డి సంఘం బలోపేతమే లక్ష్యం**

రాష్ట్రవ్యాప్తంగా సంఘం కార్యకలాపాలను విస్తరించడం, సభ్యుల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడం, యువతను సంఘం కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా తెలంగాణ రెడ్డి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రకాష్ రెడ్డి ఆకాంక్షించారు. సంఘం చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, అవసరమైన వారికి అండగా నిలిచే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. సంఘం బలోపేతం కావాలంటే నాయకులు, సభ్యుల మధ్య సమన్వయం, నిబద్ధత, ఐక్యత అవసరమని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిర్వర్తించే క్రమంలో అందరి సూచనలు, సలహాలు తీసుకుంటూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సామాజిక సమస్యల పరిష్కారంతో పాటు విద్య, ఉపాధి, సంక్షేమం వంటి అంశాలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

**రాష్ట్ర అధ్యక్షుడికి ప్రత్యేక కృతజ్ఞతలు**

తనపై నమ్మకంతో తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శి బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డికి బొబ్బిలి ప్రకాష్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన సంఘం ఇతర కార్యవర్గ సభ్యులకు కూడా ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, సంఘం ఆశయాల సాధన కోసం అంకితభావంతో పని చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, విద్యార్థుల సంక్షేమానికి, సంఘం అభివృద్ధికి కృషి చేయడమే తన ముందున్న ప్రధాన లక్ష్య మని ప్రకాష్ రెడ్డి వెల్లడించారు. తన నూతన బాధ్యతల ప్రస్థానం విజయవంతం కావాలని పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

**యువ నాయకత్వం.. సామాజిక సేవ పట్ల నిబద్ధత..**

హక్కుల సాధన కోసం కృషి చేయాలనే సంకల్పంతో బొబ్బిలి ప్రకాష్ రెడ్డి తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆయన చేపట్టే కార్యక్రమాలు సంఘం అభివృద్ధికి, సామాజిక సంక్షేమానికి దోహదపడాలని ఆశిద్దాం.

# ఇన్‌స్పెక్టర్ కనుసన్నల్లో! ఇరగదీసిన పోలీసులు?

**క్రిటికల్ కేర్‌లో అవస్థలు.**

**కరీంనగర్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా.. రాష్ట్ర వ్యాప్తంగా పేరెన్నికగన్న పోలీసులకు అడ్డాగా మారిందా? అంటే అవుననే! సమాధానాలే వస్తున్నాయి.. నాటి నేరెళ్ళ ఘటన ఇప్పటికీ పచ్చి పుండులాగే ఉండగా, మళ్లీ మరో ఘటన వెలుగులోకి రావడం సంచలనాత్మకంగా మారింది. దాదాపు రెండు గంటలు బట్టలూడదీసి కొట్టినట్టు బాధితులు చెపుతున్న మాటలు విం టుంటే మానవత్వం ఉన్న మనుషులు ఎవరైనా కదిలిపోవాల్సిందే... అయితే కరుకు ఖాకీ బూట్ల కాఠిన్యం కింద నలుగుతున్న మానవత్వం మరోసారి మంటగలిసిందనే సంఘటన గంభీరావుపేట పోలీస్ స్టేషన్ ఘటనతో నిరూపితం అయినట్టేనని తెలుస్తుంది. నాడు దేశ ప్రజలను హీనంగా చూస్తూ చీకటి జైళ్లలో, బూట్లు నాకించుకునేవారని చరిత్రలో చదువుకున్నాం.. అయితే ప్రస్తుతం కూడా అదే బ్రిటీష్ కాలం చట్టాలను అమలు చేస్తూ బాధితుల మాటల్లో చూసుకుంటే ప్రశ్నించే వారిని, దోషులుగా చిత్రీకరిస్తూ లాఠీలతో చేసిన వీరంగం విస్తుగొలిపెలా ఉందనుకోవచ్చు. అయితే సదరు బ్రిటిష్ చట్టాలు కాలంలో కలిసి, ప్రస్తుతం భారత న్యాయ సంహిత అందుబాటులోకి వచ్చినా సరే తమకు బ్రిటిష్ చట్టాలే ముద్దనే పోలీసులు ఉన్నంత కాలం ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయనే ఉదంతం మరోసారి గంభీరావు పేట ఘటనతో నిరూపితవ-ంవుతుందని తెలుస్తుంది.





**ఇరగదీసిన పోలీసులు**

సోమవారం సాయంత్రం 8 గంటల ప్రాంతంలో సంపత్ అనే వ్యక్తిని, తరువాత గంటలో శేఖర్ అనే వ్యక్తిని గంభీరావు పేట పోలీసులు కరీంనగర్ లో అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తుంది. బాధితులు వెల్లడించిన వివరాల ప్రకారం కరీంనగర్ పట్టణం దాటగానే మొదలైన పోలీసు లిప్రత్యేకలి విచారణ, స్టేషన్ లోపలికి చేరుకోగానే తారాస్థాయికి చేరుకున్నట్టు తెలుస్తుంది. దాదాపు రెండు నుండి మూడు గంటల పాటు సాగిన ఆ లిప్రత్యేక పోలీసులి విచారణ పగ వాళ్ళకు రాకూడదంటూ బాధితులు చెపుతున్న విషయం చూపరులను కంటతడి పెట్టిస్తుంది. ఎస్సై తో పాటు దాదాపు 5 నుండి 6 మంది కానిస్టేబుళ్ళు చేసిన లిప్రత్యేక విచారణలి గతంలో జరిగిన నేరెళ్ళ ఘటనకు ఏమాత్రం తీసిపోదేమో. చేసేది ఘనకార్యం అన్నట్టు ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు సదరు ఎస్సై సామాజిక మాధ్యమం ద్వారా వీడియో కాల్ చేసి మరీ చూపించినట్టు బాధితులు వెల్లడించారు. అందులో ఒకరు పోలీసు ఉన్నతాధికారి, మరొకరు ఆ ఎస్సై బంధువు ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంతా చేసి తమనెవరూ ఏం చెయ్యలేరనే అత్యుత్సాహంతో రిమాండ్ కు పంపించేందుకు ప్రయత్నం చేయగా, న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడం గమనార్హం.

**క్రిటికల్ కేర్ లో అవస్థలు**

పోలీసు అధికారుల లిప్రత్యేక విచారణలి లో ఉన్న బాధితుల్లో ఒకరైన శేఖర్ దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాగా, సంపత్ వెనకబడిన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. వారిరువురు ప్రస్తుతం నగరంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కనీసం సరిగా పడుకోలేక, కూర్చోలేక వారు పడుతున్న అవస్థలు చూస్తూ కుటుంబ సభ్యులు చేస్తున్న రోదనలు ఆసుపత్రికి వచ్చిన ప్రతీ ఒక్కరినీ కంటతడి పెట్టిస్తుంది. దాదాపు రెండు నుండి మూడు గంటల పాటు తమపై పోలీసులు చేసిన దాష్టీకం తలుచుకుంటేనే వణుకు పుడుతుందని బాధితులు గోళ్ళుమంటున్నారు. ఉద్యోగంలో



ఉన్న నా పైనే వార్తలు రాస్తావా అంటూ చెప్పలేని భాషలో బూతుల తిడుతూ వివరీతంగా కొట్టారని తెలిపారు. ఐసియులో ప్రస్తుతం చికిత్స పొందుతున్న బాధితులు యువకులు కావడం, పోలీసు దెబ్బలు భవిష్యత్తులో పెను ప్రమాదానికి దారి తీసే అవకాశం ఉండడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా గంభీరావు పేట పోలీసులు సాగిన దాష్టీకంలో కేవలం ఆ స్టేషన్ ఎస్సై తో పాటు సర్కిల్ ఇన్స్పెక్టర్, డీఎస్పీ, ఎస్పీలు కూడా భాగస్వాములే అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రోజుకు అయిదు సార్లు డిఎస్ఆర్ చెప్పే పోలీసులు, మాకు తెలియదు అంటే మాకు తెలియదు అంటూ ఉన్నత స్థాయి అధికారులు తప్పించుకుంటూ, కేవలం ఎస్సై పైనే నెపం నెట్టేలా పావులు కదపడం గమనార్హం. ఒక దళిత సామాజిక వర్గం వ్యక్తిని తమ బూట్లు నాకించడం పోలీసు పైశాచికత్వానికి పరాకాష్ట కాగా, తప్పించుకునే క్రమంలో మళ్ళీ మీడియా వ్యక్తులనే మధ్యవర్తిత్వానికి పిలుస్తుండడం కొసమెరుపు.

# స్మృతి మంధానకు సపోర్ట్ చేయాలి

**జూనియర్లకు సీనియర్లు తోడుగా ఉంటేనే విజయాలు**

**గంగూలీ నుండి ధోని.. ధోని నుండి కోహ్లీ..**

**అదే సంప్రదాయం కొనసాగాలి**

**బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్**



**స్పోర్ట్స్ డెస్క్:**

భారత మహిళల జట్టుకు స్మృతి మంధాన నూతన కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. పురుషుల జట్టులో విరాట్ కోహ్లీకి ధోని ఎలా అండగా నిలిచాడో.. అదే విధంగా స్మృతికి హర్మన్ ప్రీత్ అలాగే సహకరించాలని పేర్కొన్నారు. కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నంత మాత్రాన సీనియర్ ప్లేయర్లు జట్టుకు దూరం కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించేటప్పుడు కొత్త కెప్టెన్‌కు మార్గనిర్దేశం చేయడానికి సీనియర్ ప్లేయర్ జట్టులో ఉండాలని నేను ఎప్పుడూ నమ్ముతాను. ఎందుకంటే ఎంత అనుభవం ఉన్నా కెప్టెన్సీ చేయడం అనేది అంత సులువైన విషయం కాదు. గతంలో సౌరభ్ గంగూలీ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత ఎంఎస్ ధోని నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. ధోని కెప్టెన్‌గా ఎదిగే క్రమంలో గంగూలీ అనుభవం ఉపయోగపడింది. ఆ తర్వాత ధోనీ కూడా కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పటికీ జట్టులో కొనసాగుతూ విరాట్ కోహ్లీకి మార్గదర్శకత్వం వహించాడు. ఫీల్డింగ్ వ్యూహాలు, డీఆర్ఎస్ నిర్ణయాలు, బౌలర్ల మార్పుల విషయంలో కోహ్లీకి ధోనీ సలహాలు అందించేవాడు. రోహిత్ శర్మకు కూడా ఈ అనుభవం ఉపయోగపడింది. ప్రస్తుతం శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతల్లో స్థిరపడేందుకు కోహ్లీ, రోహిత్ వంటి సీనియర్లు సహకరిస్తున్నారు. ఇదే తరహా సంప్రదాయం మహిళల జట్టులోనూ కొనసాగాలని బీసీసీఐ భావిస్తోంది. కొత్త కెప్టెన్ స్మృతి మంధానకు హర్మన్‌ప్రీత్ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుంది. మ్యాచ్ సమయంలో క్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సందర్భాల్లో కొత్తగా జట్టు పగ్గాలు అందుకున్న ప్లేయర్ అయోమయానికి గురయ్యే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో హర్మన్‌ప్రీత్.. స్మృతికి విలువైన ఆస్తిలా ఉపయోగపడుతుంది. జట్టులో సీనియర్లు జూనియర్లకు సహకరిస్తూ ఆడుతుంటే విజయాలు వాటతంటే అవే వస్తాయి' అని మిథున్ తెలిపారు. అయితే, స్మృతి మంధానను కెప్టెన్‌గా ఎంపిక చేయడానికి గల నిర్దిష్ట కారణాలపై ఆయన నేరుగా స్పందించకపోవడం గమనార్హం.

# ఆంధ్ర,కర్ణాటక రంజీ పోరు డ్రాగా

**కరుణ్ నాయర్ పోరాటంతో కర్ణాటకకు ఊరట**

**రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 337 పరుగులు**

**ఐదు వికెట్లతో సత్తా చాటిన ఎల్. మోహన్**

**మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఆంధ్ర బ్యాటర్ ఎస్.వి. రాహుల్**



**స్పోర్ట్స్ డెస్క్:**

విజయవాడ సమీపంలో లోని మూలపాడు వేదికగా ఆంధ్ర, కర్ణాటక జట్ల మధ్య జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. నాలుగో రోజు గురువారం కర్ణాటక రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనకు దిగిన ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. దీంతో ఇరు జట్ల మధ్య పోరు ఫలితం తేలకుండా ముగిసింది.

**కరుణ్ నాయర్ పోరాటం..**

రెండో ఇన్నింగ్స్‌లో కర్ణాటకను ఆదుకోవడంలో కరుణ్ నాయర్ కీలక పాత్ర పోషించాడు. అతడి అద్భుత బ్యాటింగ్‌తో కర్ణాటక మెరుగైన స్కోరు సాధించి ఆంధ్ర విజయావకాశాలను దెబ్బతీసింది. ఆంధ్ర బౌలర్లలో ఎల్. మోహన్ ఐదు వికెట్లు పడగొట్టగా, ఎస్. కుమార్ మూడు, టీ. విజయ్ ఒక వికెట్ సాధించారు.

**రాహుల్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్..**

ఆంధ్ర తరఫున ఎస్.వి. రాహుల్ రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆకట్టుకున్నాడు. 85 బంతులు ఎదుర్కొని ఐదు ఫోర్లతో 35 పరుగులు చేశాడు. కర్ణాటక బౌలర్లలో శిఖర్ శెట్టి రెండు వికెట్లు తీయగా, బత్కల్, బజాజ్ చెరో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌తో రాణించిన ఆంధ్ర ఆటగాడు ఎస్.వి. రాహుల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

# యార్కర్ల కింగ్ బ్యాక్

- **మళ్లీ ఆరెంజ్ జెర్సీలో నటరాజన్**
- **ఎస్సార్‌హెచ్ అభిమానులకు గుడ్ న్యూస్**
- **జీషన్ అన్సారీని వదులుకుని నటరానును దక్కించుకున్న ఎస్సార్‌హెచ్ మేనేజ్‌మెంట్**
- **ఐపీఎల్ మినీ వేలానికి ముందే కీలక నిర్ణయం తీసుకున్న సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ**



**స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2027 సీజన్ మినీ వేలానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు గుడ్ న్యూస్. ఆరెంజ్ ఆర్మీ మాజీ పేసర్, యార్కర్ల కింగ్ టీ నటరాజన్ జట్టులోకి తిరిగొచ్చాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో ప్లేయర్ స్వాప్ ట్రేడ్ డీల్ ద్వారా నటరాజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి తెచ్చుకుంది. అతనికి బదులుగా లెగ్ స్పిన్నర్ జీషన్ అన్సారీని వదులుకుంది. ఈ ప్లేయర్ స్వాప్ డీల్‌ను ఐపీఎల్ నిర్వాహకులు అధికారికంగా ధ్రువీకరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ కూడా జట్టులోకి నటరాజన్ తిరిగొచ్చాడనే విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. నటరాజన్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తోనే క్రికెట్ ప్రపంచానికి పరిచయమయ్యాడు. 2020-2024 వరకు మొత్తం ఐదు సీజన్ల పాటు ఆరెంజ్ ఆర్మీకి ప్రాతినిధ్యం వహించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. ముఖ్యంగా ఐపీఎల్ 2024 సీజన్‌లో 19 వికెట్లు పడగొట్టి జట్టు ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో టీమిండియాలో కూడా చోటు దక్కించుకున్నాడు. కానీ ఆ తర్వాత గాయాల బెడదతో జట్టుకు దూరమై ఫామ్ కోల్పోయాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో నటరాజన్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.10.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పుడు ట్రేడ్ డీల్‌లో భాగంగా అతన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.5 కోట్ల సవరించిన ఫీజుతో తిరిగి జట్టులోకి తీసుకుంది. మరోవైపు జీషన్ అన్సారీ మాత్రం తన బేస్ ప్రైజ్ రూ.40 లక్షలతోనే ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి చేరాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి ఎంట్రీ ఇచ్చిన జీషన్స్ అన్సారీ ఆ సీజన్‌లో 10 మ్యాచ్‌లు ఆడి 6 వికెట్లే పడగొట్టాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో తన అరంగేట్ర మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసాడు. కానీ ఆ తర్వాత ఆ జోరును కొనసాగించలేకపోయాడు.

## 400 కుటుంబాలకు చేయూత

అగ్ర కథానాయిక రష్మిక మందన్న 'ప్రాజెక్ట్ అన్నపూర్ణ' పేరుతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 400 కుటుంబాలకు నిత్యావసర వస్తువుల ఖర్చును భరించేందుకు ముందుకొచ్చింది. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పంచుకుంది రష్మిక మందన్న. నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను పంపిణీ చేస్తున్న వీడియోను కూడా షేర్ చేసింది. ఈ ఛారిటీ కోసం ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాల నుంచి 400 కుటుంబాలను ఎంపిక చేసినట్లు తెలిసింది. 'ఒక్కోవిడత 400 కుటుంబాలకు మూడు నెలల పాటు నిత్యావసర సరుకులు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా.వచ్చే ఏడాది మొత్తం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తాను. దీనివల్ల ఆ కుటుంబాలు సరుకుల కోసం చేసే ఖర్చు ఆదా అవుతుంది. ఆ మొత్తాన్ని వారు ఇతర అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చు' అని రష్మిక మందన్న పేర్కొన్నది. సేవా కార్యక్రమాలంటే పెద్ద పెద్ద పనులే చేయాల్సిన అవసరం లేదని, దయాగుణంతో చేసే చిన్న సాయం కూడా ఒకరి జీవితాన్ని మార్చుతుందని, మనందరం ఏదో ఒక చిన్న పనితో ఇతరులను ఆదుకోవాలని రష్మిక మందన్న పిలుపునిచ్చింది.





# అమ్మ కదిలి వచ్చే..

భక్తి పారవశ్యంలో ఊరేగే అమ్మవారు, అడుగడుగునా ఆధ్యాత్మిక శోభతో అలరారే ఉత్సవాలు, నవదుర్గలు తొమ్మిది రూపాల్లో ఆవిష్కృతమయ్యే దైవభక్తి.. ఈ వైభవాన్ని ఆవిష్కరిస్తూ గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న చారిత్రక చిత్రం 'భరతవర్ష' నుంచి 'అమ్మ కదిలి వచ్చే' అనే పాట విడుదలైంది.సంకల్ప్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. క్రీ.శ. 642 నాటి కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'అమ్మ కదిలి వచ్చే' పాటకు అనుదీప్‌దేవ్ సంగీతాన్నందించారు. కల్యాణ్‌చక్రవర్తి త్రిపురనేని ఈ పాటకు సాహిత్యాన్ని సమకూర్చారు.



# దశావతారాల కథ 'హైందవ'

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న మిస్టికల్ డివోషనల్ థ్రిల్లర్ 'హైందవ' నవంబర్ 27న విడుదలకానుంది. మహేష్ చందు నిర్మాత. సంయుక్త మీనన్ కథానాయిక. బుధవారం టీజర్‌ను ఆవిష్కరించారు. రంగాపురం అనే గ్రామంలోని పురాతన ఆలయంలో విగ్రహాలన్నీ మాయం అవుతాయి. అదే సమయంలో గ్రామంలో ఓ వ్యక్తి హత్యకు గురవుతాడు. ఈ కేసుని పరిశోధించడానికి దేవుడిపై నమ్మకం లేని ఓ పోలీస్ అధికారిని నియమిస్తారు.ఈ నేపథ్యంలో చోటుచేసుకునే ఆసక్తికరమైన సంఘటనలతో టీజర్ ఆద్యంతం ఆసక్తిని పెంచింది. అద్భుతమైన కథ, విజువల్స్‌తో కూడిన మిస్టికల్ థ్రిల్లర్ ఇదని, ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ని అందిస్తుందని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తెలిపారు. దశావతార గుడి నేపథ్యంలో జరిగే కథ ఇదని దర్శకుడు పేర్కొన్నారు.

## ప్రభాస్ బర్త్ డే గిఫ్ట్ కు ఫిదా అయిపోయిన 'ఫౌజీ' భామ ఇమాన్వీ

ప్రభాస్ కోస్టార్ ఇమాన్వీ మంగళవారం 31వ పుట్టినరోజు జరుపుకుంది. తన కోస్టార్లకు షడ్రుచులతో కూడిన భోజనం పెట్టి మరిచిపోలేని ఆతిథ్యాన్నిచ్చే యాక్టర్లలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తర్వాతే మరెవరైనా అనడంలో ఎలాంటి సందేహం లేదు.Fauzi | గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ (Prabhas) కాంపౌండ్ నుంచి వస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటి 'ఫౌజీ'(Fauzi) . హను రాఘవపూడి (Hanu Raghavapudi) దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఇమాన్వీ (Imanvi) హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన ఫౌజీ లుక్స్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి.





Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com